

చెదిరిన కల!

హైదరాబాద్‌లో ఉద్యోగం చూసుకుని భర్తతోపాటు అక్కడే పిల్లలతో కలిసి సంతోషంగా ఉండొచ్చన్న ఆమె ఆశలు అడియాసలయ్యాయి. ఏడాదికి రూ.15 లక్షల ప్యాకేజీతో ఉద్యోగానికి ఎంపికైన ఆనందం కొన్ని గంటలు గడవక ముందే ఆవిరైంది. కారు డ్రైవర్ నిద్రమత్తు, అతివేగం.. ఆమెతోపాటు కుమారుడిని, తల్లిని బలి తీసుకుంది. ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలం లక్ష్మీనగర్ జాతీయ రహదారిపై జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిది తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని రాజవోలు గ్రామం. దీంతో ఆ గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు నెలకొన్నాయి.

- రూ.15 లక్షల జీతంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి మహిళ ఎంపిక
- ఆనందంతో హైదరాబాద్ నుంచి రాజవోలుకు ప్రయాణం
- లక్ష్మీ నగర్ వద్ద ఆగి ఉన్న ట్రాలీ లారీని ఢీకొన్న కారు
- తల్లి, కుమారుడు సహా మహిళ మృతి.. ఇద్దరికి గాయాలు
- డ్రైవర్ నిద్రమత్తు.. అతివేగమే ప్రమాదానికి కారణం







రోడ్డు ప్రమాద దృశ్యం.. కారులో మృతదేహాలు, తీవ్రంగా గాయపడిన డ్రైవర్.. ఇద్దరు కుమారులు నితిన్, షణ్ముఖిలతో తల్లిదండ్రులు నాగార్జున, భాగ్యశ్రీ (ఫైల్)

ద్వారకాతిరుమల/రాజమహేంద్రవరం రూరల్/సిటీ, జూలై8: రోడ్డు ప్రమాదం.. ఒక కుటుంబంలో తల్లిని, కుమార్తెను, మనువడిని బలితీసుకుంది. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి రూరల్ మండలం రాజవోలుకు చెందిన రాచబత్తుని నాగార్జున, భాగ్యశ్రీ దంపతులకు ఇద్దరు కుమారులు నాగ షణ్ముఖి, నాగ నితిన్‌కుమార్ ఉన్నారు. నాగార్జున హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ నిర్వహిస్తూ అతను ఒక్కడే అక్కడ ఉంటున్నాడు. గ్రామంలోనే పిల్లలతోపాటు ఉంటున్న భాగ్యశ్రీ తనకు హైదరాబాద్‌లో ఉద్యోగం వస్తే భర్త వద్దకు వెళ్లే ప్రయత్నాల్లో ఉంది. ఈ నేపథ్యంలోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇంటర్వ్యూ నిమిత్తం రెండు రోజుల కిందట హైదరాబాద్‌కు ఇద్దరు కుమారులతోపాటు భీమవరానికి చెందిన ఆమె తల్లిదండ్రులు బొమ్మా నారాయణరావు, కమలాదేవితో కలిసి వెళ్లారు. అక్కడ ఇంటర్వ్యూ పూర్తి చేసుకుని ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులతో కలిసి భాగ్యశ్రీ ఆదివారం రాత్రి హైదరాబాద్ నుంచి రాజవోలుకు ప్రయాణమైంది. భర్త నాగార్జున పనిపై అక్కడే ఆగిపోగా, తండ్రి నారాయణరావు కూడా విజయవాడలో కారు దిగి పోయారు. తర్వాత ఆయన ట్రైన్‌లో భీమవరం వెళ్లిపోయారు. మిగిలిన వారు రాజవోలు బయలుదేరారు. సోమవారం తెల్లవారుజామున ద్వారకాతిరుమల మండలం లక్ష్మీనగర్ వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉన్న చెన్నై నుంచి కాకినాడకు వెళ్తున్న మిషనరీ లోడు ట్రాలీ లారీని కారు వేగంగా వెనుక నుంచి ఢీకొట్టి ట్రాలీలోకి దూసుకుపోయింది. క్రేన్ సహాయంతో కారును బయటకు తీశారు. భాగ్యశ్రీ (27), నితిన్ కుమార్(4), కమలాదేవి (55) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలైన కొవ్వూరు మండలం వాడపల్లికి చెందిన డ్రైవర్ దుర్గావంశీ, చిన్నారి నాగ షణ్ముఖిలను స్థానికులు బయటకు తీసి అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ వంశీ పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ఎస్పీ మేరీ ప్రశాంతి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. భీమడోలు సీఐ బి.బి.రవికుమార్, పోలీసు సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ప్రమాదానికి కారణమేమిటి..

ఘటనా స్థలంలో సీసీ ఫుటేజీని పరిశీలిస్తే సరిగ్గా ఉదయం 5.42 గంటలకు వీరు ప్రయాణిస్తున్న ఎర్టిగా కారు రోడ్డుపై మెలికలు తిరుగుతూ పక్కన ఆపి ఉంచిన కంటైనర్ లారీని అతివేగంతో ఢీకొట్టింది. డ్రైవర్ దుర్గావంశీ నిద్రమత్తు, అతివేగం లేక వేరే కారణం ఏమైనా ఉందా? అనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. నిబంధనలకు విరుద్ధంగా జాతీయ రహదారి పక్కన కంటెయినర్‌ను ఆపడం వల్లే ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు.

విషాదఛాయలు

భాగ్యశ్రీతోపాటు ఆమె కుమారుడు నితిన్, తల్లి కమలాదేవిల మృతితో రాజవోలు, భీమవరంలలో విషాదఛాయలు నెలకొన్నాయి. గుంటూరు జిల్లా భట్టిప్రోలుకు చెందిన నాగార్జునకు భీమవరానికి చెందిన భాగ్యశ్రీకి వివాహం కాగా, వీరి ఇద్దరి కుమారులతో కొన్నాళ్లుగా రాజవోలులోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. భాగ్యశ్రీ తన భర్తకు చేదోడుగా ఉండి కుటుంబాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు హైదరాబాద్ వెళ్లిపోయి అక్కడే ఉద్యోగం చేయాలని నిర్ణయించి ఇంటర్వ్యూకి వెళ్లింది. ఏడాదికి రూ.15 లక్షల ప్యాకేజీతో ఎంపికైంది. దీంతో కుటుంబ సభ్యులంతా సంతోషంగా ఉన్నారు. ఆ ఆనందం కొన్ని గంటలు గడవక ముందే ఆ ఇంట విషాదం అలుముకుంది. బంధువులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు.

పోస్టుమార్టం పూర్తి.. బంధువులకు అప్పగింత

ఏలూరు క్రైం : ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో కమలాదేవి, భాగ్యశ్రీ, నితిన్‌కుమార్ మృతదేహాలకు భీమడోలు సీఐ రవికుమార్, ద్వారకాతిరుమల ఎస్ఐ సతీష్, ఏఎస్ఐ రాగిరి రాంబాబు శవ పంచనామా నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రి ఇన్‌చార్జి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పీఏఆర్ఎస్ శ్రీనివాసరావు ఆదేశాలతో ఆర్ఎంవో డాక్టర్ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో మృతదేహాలకు వైద్య నిపుణుల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.



ఇసుక రెడీ!

పెరవలి మండలం తీపర్రు - ఉసులుమర్రు స్టాక్ పాయింట్ వద్ద ఇసుక ఎగుమతికి సిద్ధంగా ఉంచిన ఎక్స్‌కవేటర్

- స్టాక్ పాయింట్లలో టన్ను ఇసుక రూ.270
- గతంలో టన్ను ఇసుకను రూ.950 వరకూ విక్రయం
- ఈ ఇసుకను ఇళ్ల నిర్మాణాలకు సరఫరా చేస్తాం : కలెక్టర్ వెల్లడి
- ఇసుక కావాల్సినవారు సచివాలయ సెక్రటరీ సర్టిఫికెట్ తెచ్చుకోవాలి : కొవ్వూరు సబ్ కలెక్టర్
- తొలిరోజు క్షేత్రస్థాయిలో ప్రారంభం కాని ఇసుక అమ్మకాలు

రాజమహేంద్రవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): స్టాక్ పాయింట్లలో టన్ను ఇసుకకు రూ.270 వంతున తీసుకుని పంపిణీ చేయాలని జిల్లా అధికారులు నిర్ణయించారు. సీనరేజీ, తవ్వకం, లోడింగ్, రీ లోడింగ్, ర్యాంపు నుంచి స్టాక్ పాయింట్ దాకా రవాణా చార్జీలు, జీఎస్టీ, డీఎంఎఫ్ వంటి చార్జీలని కలుపుకుని టన్నుకు రూ.270 నిర్ణయించారు. జిల్లాలోని రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్లలోని మొత్తం 7 స్టాక్ పాయింట్లలోనూ ఇదే ధర నిర్ణయించారు. గత ప్రభుత్వంలో పాలనాపరమైన చార్జీలు ఎగ్గొట్టి కూడా స్టాక్ పాయింట్ల వద్ద టన్ను ఇసుకను రూ.950 వరకూ విక్రయించడం గమనార్హం. సోమవారం స్టాక్ పాయింట్ల వద్ద అమ్మకాలు జరగలేదు. ప్రభుత్వ జీవో జిల్లా అధికార్లకు ఆలస్యంగా అందడం, దాని ప్రకారం ధర నిర్ణయించడానికి సమయం పట్టడంతో మంగళవారం నుంచి స్టాక్ పాయింట్ల వద్ద ఉచిత ఇసుక పంపిణీ మొదలు కానుంది.

ఆ .. ఇసుకను ఇళ్ల నిర్మాణాలకు సరఫరా చేస్తాం

గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల్లో డీసిల్టేషన్ కింద తీసి స్టాక్ పెట్టిన ఇసుకను ఉచిత ఇసుక విధానంలో గృహనిర్మాణాలకు సరఫరా చేయడానికి సన్నద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికార్లను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆమె కాతేరు, గాయత్రీ ర్యాంపులను ఆకస్మికంగా తనిఖీచేసి, అక్కడి బోట్స్‌మన్ సొసైటీ సభ్యులతో ముఖాముఖీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పంపిణీ విధానం అమలులో భాగంగా కేవలం పరిపాలనాపరమైన ఖర్చులు మాత్రమే నిర్ణయించి వసూలు చేస్తుందని ఆమె వివరించారు. ప్రస్తుతం గోదావరి నదికి వరద సీజన్ కాబట్టి, ర్యాంపుల్లోని ఇసుక స్టాక్ పంపిణీని వేగవంతం చేయాలన్నారు. బోట్స్‌మన్‌తీసే ఇసుక రవాణా తదితర అంశాలపై సభ్యులతో ఆమె చర్చించారు. ఇక్కడ సుమారు 250కి పైగా బోట్లు ఉన్నాయని, వాటి ద్వారా రోజుకు 4 నుంచి 5 ట్రిప్పుల ఇసుక తీస్తామని, ఒక యూనిట్ కోసం 450 బకెట్లు ఇసుక తీస్తామని, రెండు గంటల సమయంలో 5 యూనిట్ల వరకూ ఇసుక తోడగలమని వారు కలెక్టర్‌కు వివరించారు. ఈ తనిఖీలలో మున్సిపల్ కమిషనర్ జిల్లా ఇన్‌చార్జి జేసీ, కె.దినేష్‌కుమార్, ఆర్డీవో ఎ.చైత్రవర్షిణీ, మైన్స్ ఏడీ ఎం. సుబ్రహ్మణ్యం, రూరల్ తహశీల్దార్ వైవీ కె.అప్పారావు పాల్గొన్నారు.

తొలి రోజు సన్నద్ధమే కానీ..

పెరవలి, జూలై8: ఉచిత ఇసుక సరఫరాకు ఉన్నతాధికారుల నుంచి ఇంకా ఎటువంటి ఆదేశాలు రాకపోవడంతో పెరవలి మండలం తీపర్రు- ఉసులుమర్రు మధ్య స్టాక్ పాయింట్ నుంచి సోమవారం ఇసుక ఎగుమతులు ప్రారంభంకాలేదు. వాస్తవానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక రెవెన్యూ సిబ్బంది ఇసుక పంపిణీకి ఇక్కడ ఏర్పాట్లు పూర్తిచేశారు. స్టాక్ పాయింట్ పక్కనే గల ఓ ప్రైవేటు గొడౌన్‌లో కంప్యూటర్‌ను ఏర్పాటుచేశారు. నెట్ సౌకర్యం కోసం బీఎస్ఎన్ఎల్ వారికి నెట్ సౌకర్యం కల్పించాలని కోరినట్టు తెలిపారు. ఇసుక ఎగుమతి చేయడానికి ఎక్స్‌కవేటర్లు కూడా ఇక్కడ సిద్ధంగా ఉంచారు. అయితే ఇసుక ఎగుమతి చేయడానికి తగిన విధివిధానాలు ఉన్నతాధికారుల నుంచి రాకపోవడం, చార్జీల నిమిత్తం ఎంత వసూలు చేయాలన్నది ఖరారు కాకపోవడంతో తొలిరోజు ఇసుక పంపిణీకి వీలుకాలేదు. సాయంత్రానికి ఇసుక చార్జీలు నిర్ణయించడంతో మంగళవారం నుంచి విక్రయాలు ప్రారంభించే అవకాశం ఉంది. ఉన్నతాధికారుల నిబంధనల మేరకు ఇసుక ఎగుమతి చేస్తామని ఇన్‌చార్జి పెరవలి డిప్యూటీ తహశీల్దార్ (రీ సర్వే) సన్నిబాబు తెలిపారు. ఆయన సోమవారం ఈ స్టాక్ పాయింట్ వద్ద పైఆదేశాల ఎదురుచూశారు. ఆయనతోపాటు తీపర్రు, కానూరు ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, వీఆర్‌ఏలు నారాయణస్వామి, విశ్వనాథం కూడా ఉన్నారు.

సచివాలయ సర్టిఫికెట్ అవసరం

కొవ్వూరు, జూలై 8 : ఇసుక అవసరమైన నిర్మాణదారులు సచివాలయ సెక్రటరీల వద్ద సర్టిఫికెట్ తీసుకోవాలని కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ చెప్పారు. సోమవారం కొవ్వూరు మండలం కుమారదేవం ఇసుక ర్యాంపును సబ్‌కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. స్టాక్ యార్డులో ఇసుక దొంగతనంగా తరలించకుండా భద్రతా చర్యలు చేపట్టామన్నారు. స్టాక్‌యార్డుకు గేట్లు, విద్యుత్ లైట్లు, సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశామన్నారు. నిరంతరం నిఘా పెట్టాలని అధికారులను సూచించారు. ఆయన వెంట తహశీల్దార్ కె.మస్తాన్ ఉన్నారు.



కొవ్వూరు మండలం కుమారదేవం ఇసుక ర్యాంపులో తనిఖీలు నిర్వహిస్తున్న సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ



రాజమహేంద్రవరంలో సోమవారం జరిగిన బీజేపీ రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న కేంద్ర సహాయ మంత్రులు, బీజేపీ రాష్ట్ర మంత్రి, నేతలు

క్షేత్రస్థాయి నుంచి బీజేపీ బలోపేతమే లక్ష్యం

రాజమహేంద్రవరంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదం

- 5లో



జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ పి ప్రశాంతికి ఫిర్యాదు చేస్తున్న పాత, కొత్త తుంగపాడు రైతులు

జగనన్న కాలనీకి భూములు ఇచ్చాం..

డబ్బులు ఇవ్వలేదు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాత, కొత్త తుంగపాడు రైతుల ఆవేదన

రాజమహేంద్రవరం సిటీ/రూరల్ జూలై8: జగనన్న కాలనీల కోసం తమ భూములను సేకరించిన గత ప్రభుత్వం తమకు డబ్బులు ఇవ్వలేదని, ఒరిజనల్ దస్తావేజులు తీసుకుని వాటినీ తిరిగివ్వకుండా ఇబ్బందులకు గురిచేసిందని రాజానగరం మండలం పాత, కొత్త తుంగపాడు గ్రామాలకు చెందిన బాధిత రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యాలయంలో బాధిత రైతులు కర్రి చిన్నా, కాళ్ళ సూర్యకుమారి, నున్న యేసుబాబు, ప్రగడ గోవిందరాజు, సున్న సూర్యవతి తదితరులు కలెక్టర్ పి.ప్రశాంతిని కలిసి తమ సమస్యను విన్నవించారు. 2023 మే 24న అప్పటి సర్వేనెంబరు 402, 391, 390, 123/1లలో 60 ఎకరాల భూములను జగనన్న కాలనీలకోసం అధికారులు సేకరించారని, వాటి ఒరిజనల్ డాక్యుమెంట్లు అధికారులు తీసుకున్నారని, ఇప్పటివరకు తమకు డబ్బులు ఇవ్వలేదన్నారు. కలెక్టర్ మాధవీలతను కలిసి సమస్య వివరించామని, తమ బిల్లులు రద్దుచేసి ఒరిజనల్ దస్తావేజులు తిరిగిస్తామని చెప్పిన అప్పటి కలెక్టర్ ఏ చర్యలు తీసుకోలేదని వివరించారు. తక్షణమే తమ భూముల దస్తావేజులు ఇచ్చేయాలని కలెక్టర్‌కి విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ కొద్దిరోజుల్లో మీ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మరెన్నో వినతులు... సావధానంగా విన్న కలెక్టర్

అలాగే రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాలకు చెందిన దివ్యాంగులు సోమవారం కలెక్టర్ ప్రశాంతిని కలిసి తాము 80 శాతంపైబడి అంగవైకల్యం కలిగిన వారమని, తాము రూ.15 వేల పింఛనుకు అర్హులమని విజ్ఞప్తిచేశారు. దివ్యాంగులను చూసిన కలెక్టర్ కిందకు వచ్చి మరీ అర్జీలను స్వీకరించారు. ఇందులో సీతంపేటకు చెందిన వరలక్ష్మి అనే మహిళ తాను తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నానని, నడవలేని స్థితిలో ఉన్న తనకు దివ్యాంగుల పింఛను రూ.15 వేలు ఇప్పించాలని విజ్ఞప్తి చేసింది. ఈ సమస్యలపై చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. అనంతరం ధవళేశ్వరంనకు చెందిన యర్రా ఉమామహేశ్వరికి దివ్యాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రూ.8,500 విలువ చేసే ట్రైసైకిల్‌ను కలెక్టర్ అందించారు. రాజమహేంద్రవరం 49వ డివిజన్ పరిధిలో సుమారు 25 ఎకరాల్లో గోతులుగా ఉన్న క్వారీని పూడ్చివేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని స్థాయీ సంఘం మాజీ ఛైర్మన్ బర్రే కొండబాబు కలెక్టర్, డీఆర్వోలకు విన్నవించారు. కాగా సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు జిల్లా స్థాయి అధికారులురాకుండా కింది స్థాయి ఉద్యోగులను పంపించడంతో కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తూ మైక్‌లో జిల్లా స్థాయి అధికారులుకాని వారు హాలులో ఉంటే తక్షణమే బయటకు వెళ్లిపోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు అర్జీలను రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్, డీఆర్వో నరసింహులు, టూరిజం జేడీ వి.స్వామినాయుడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు టీ రాధిక, ఆర్డీవో కృష్ణనాయక్ తదితరులు స్వీకరించారు.



ధవళేశ్వరంలో జిల్లా కలెక్టర్‌తో మాట్లాడుతున్న స్థానిక ఎమ్మెల్యే గోరంట్ల

పారిశుధ్య పనులపై కలెక్టర్ ఆగ్రహం

- ధవళేశ్వరంలో డ్రైన్‌లు, పారిశుధ్య పరిస్థితులను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే
- డ్రైనేజీల అభివృద్ధికి రూ.3 కోట్లతో ప్రణాళిక : ఎమ్మెల్యే గోరంట్ల

ధవళేశ్వరం, జూలై8: ధవళేశ్వరం గ్రామంలో నెలకొన్న అపారిశుధ్య పరిస్థితులపై కలెక్టర్ ప్రశాంతి అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వారం రోజుల్లో పరిస్థితులను మెరుగుపరచాలని ఆదేశించారు. సోమవారం గ్రామంలో కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మండల అధికారులతో కలిసి పర్యటించారు. డ్రైన్‌లలో నీరుపారక బురదమయంగా మారిన రోడ్లపై వీరు నడిచి వెళుతూ పరిశీలించారు. 140 మంది పారిశుధ్య సిబ్బంది ఉన్నా పారిశుధ్య పనుల నిర్వహణపై అధికారులు అలసత్వం వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సిబ్బంది హాజరు వివరాలతో కూడిన నివేదిక అందజేయాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. పలుచోట్ల మురికినీటి కాలువలను ఆక్రమించి నిర్మాణాలు ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఆ నిర్మాణాలను ఇంటి యజమానులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేకపోతే పంచాయతీ సిబ్బందిచే ఆ నిర్మాణాలను తొలగించి అందుకు అయ్యే రుసుం వసూలు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ డ్రైనేజీల కోసం రూ.3 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేశామని, ఈ నిధులు విడుదలైతే త్వరితగతిన పనులు చేపట్టాల్సి ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పర్యటనలో డీపీవో డి.రాంబాబు, ఎంపీడీవో శ్రీనివాసరావు, మండల ప్రత్యేకాధికారి కేవీఎస్ జ్యోతి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గోరంట్ల.. స్వచ్ఛభారత్

ధవళేశ్వరం శాటిలైట్ సిటీలో సోమవారం ఉదయం నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పాల్గొని డ్రైన్‌లో చెత్తను తొలగించారు. టీడీపీ ధవళేశ్వరం పట్టణాధ్యక్షుడు పండూరి అప్పారావు ఆధ్వర్యంలో ఇది జరుగగా నాయకులు పాల్గొన్నారు.



డ్రైన్‌లో చెత్తను తొలగిస్తున్న ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, ఇతర నేతలు



జీవీఎల్ నరసింహారావు, ఎమ్మెల్యే నల్లమిల్లి



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్



సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

- రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ పటిష్టతకు ప్రణాళిక
- సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఆలోచన
- పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదం

క్షేత్రస్థాయి నుంచి బీజేపీ బలోపేతమే లక్ష్యంగా

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 8 : బీజేపీ రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం సోమవారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జరిగింది. రాష్ట్రంలో క్షేత్రస్థాయి నుంచి బీజేపీ పార్టీని బలోపేతం చేసే విషయంపై కార్యవర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ, తెలుగుదేశం, జనసేన కూటమి ఘన విజయం సాధించిన తర్వాత రాష్ట్రస్థాయిలో నిర్వహించిన తొలి సమావేశం కావడంతో దీనికి ప్రాధాన్యత ఏర్పడింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు ఎల్ మురుగన్, భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్‌యాదవ్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ తదితరులు మాట్లాడారు. కేంద్ర సమాచారశాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ మాట్లాడుతూ డబుల్ ఇంజన్ సర్కార్ ద్వారా దేశంలో అభివృద్ధి వేగంగా జరుగుతోందని, గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లో మాదిరిగానే ఆంధ్రరాష్ట్రంలోనూ రాబోయే రోజుల్లో అభివృద్ధి వేగం పుంజుకుంటుందన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో జగన్ రాక్షస, నియంతృత్వ, అవినీతి, అరాచకపాలన వల్ల వ్యవస్థలన్నీ నిర్వీర్య మయ్యాయన్నారు. ప్రతీ శాఖను తాకట్టుపెట్టి పెద్దమొత్తంలో అప్పులు చేశారని ఈ ఆర్థిక విధ్వంసం పూడ్చాలంటే దశాబ్దాలు పట్టేటట్టు ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి విజయంతో వచ్చిన బాధ్యతను బీజేపీ కేడర్ అంతా గుర్తుంచుకోవాలని... ప్రజాసంక్షేమ పాలన, రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడే పాలన, అవినీతిరహిత పాలన అందిస్తేనే ప్రజలు మనల్ని ఆశీర్వదిస్తారని గమనించాలని పేర్కొన్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ఏపీలో గెలుపొందిన బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలను పేరు పేరునా అభినందించారు. ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, విష్ణుకుమార్‌రాజు, ఆదినారాయణ రెడ్డి, సుజనాచౌదరి, పీవీ పార్థసారథి, ఎస్.ఈశ్వరరావు, కామినేని శ్రీనివాసరావు, నాయకులు మధుకర్, జీవీఎల్ నరసింహరావు, సోము వీర్రాజు, పీవీఎన్ మాధవ్, శివప్రకాష్, విష్ణువర్ధన్‌రెడ్డి, కాశీ విశ్వనాథరాజు, లంక దినకర్, పాతూరి నాగభూషణం, వేటుకూరి సూర్యనారాయణరాజు, రేలంగి శ్రీదేవి, బొమ్ముల దత్తు, రొంగల గోపి, అడబాల రామకృష్ణారావు, ఎనుముల రంగబాబు, కురగంటి సతీష్ తదితరులతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి మురుగన్‌ను సత్కరించిన పురందేశ్వరి

చక్కటి సమన్వయంతో కూటమి విజయం

కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ



మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

బీజేపీ, తెలుగుదేశం, జనసేన పార్టీల చక్కటి సమన్వయంతో రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించిందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలో జరిగిన బీజేపీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అరుణ్‌సింగ్, సిద్ధార్థనాథ్ సింగ్ వంటి పెద్దలు ఈ విషయంలో చేసిన కృషి అభినందనీయమన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇలాంటి సమన్వయం పరిస్థితి ఉందని ఆయన పేర్కొన్నారు. ఐపీసీ, సీఆర్‌పీసీ, ఐఏఎస్ చట్టాలను, వాటిని భారత న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినయం పేరుతో సత్వరమే అమలయ్యే చట్టాలను అమల్లోకి తీసుకొచ్చిన ప్రధాని మోదీ ప్రభుత్వానికి మద్దతుగా ప్రజల తరపున బీజేపీ ఆంధ్రప్రదేశ్ కార్యవర్గ స్వాగతిస్తూ ధన్యవాద తీర్మానం ప్రవేశపెట్టినట్టు ఆయన పేర్కొన్నారు.

రాజమహేంద్రవరంలో బీజేపీ శ్రేణుల సందడి

రాజమహేంద్రవరంలో సోమవారం నిర్వహించిన బీజేపీ విస్తృతస్థాయి రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి హాజరైన నాయకులు, కేడర్‌తో సందడి వాతావరణం నెలకొంది. రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం కావడంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి కమలం శ్రేణులు తరలివచ్చాయి. బీజేపీకి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు, రాష్ట్రమంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు ఆ పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు పలువురు ఈ సమావేశానికి హాజరుకావడం, వారితోపాటు వారి అనుచరగణం కూడా కార్లు, ఇతర వాహనాల్లో తరలి రావడంతో రాజమహేంద్రవరంలోని పలు ప్రధాన రోడ్లపై హడావుడి కనిపించింది. సెంట్రల్ జైలు రోడ్డులోని ఓ హోటల్‌లో ఈ సమావేశం నిర్వహించారు. దీంతో ఈ రోడ్డు మార్గంలో వాహనాలు బారులు తీరాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సమావేశం జరిగింది. సుమారు 2,500 మంది ఈ సమావేశానికి హాజరయ్యారని నాయకులు వెల్లడించారు. ఈ మార్గంలో దారిపొడవునా బీజేపీ జెండాలు కట్టారు. పలు ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు, హోర్డింగులు ఏర్పాటు చేశారు. మరో పక్క సమావేశం ప్రాంగణంలో కోలాహలం నెలకొంది. ఆయా జిల్లాల నుంచి వచ్చిన వారి పేర్ల రిజిస్ట్రేషన్‌కు, ఇతర సమాచారం కోసం ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు.

గంజాయి విక్రేత అరెస్టు

యానాం, జూలై 8: యానాం నియోజకవర్గ పరిధిలోకి గంజాయి తెచ్చి విక్రయిస్తున్న స్థానిక కురసాంపేటకు చెందిన బల్లా జోజీ (22)ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మురుగనందం తెలిపారు. అతని వద్ద నుంచి సుమారు రూ.20 వేలు విలువ చేసే 40 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇటీవల కాలంలో చెడు వ్యసనాలకు అలవాటు పడిన జోజి తరుచూ ఉప్పాడ వద్ద ఓ గుడి సమీపంలో గంజాయిని తెచ్చి యానాం, పరిసర ప్రాంతాలలో ఎక్కువ రేట్లకు విక్రయిస్తుండగా యానాంలో హైస్కూల్ రోడ్డులో క్రైం సిబ్బంది పట్టుకున్నారన్నారు. గంజాయి, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడు జోజిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారన్నారు.

తుని పట్టణంలో భారీ చోరీ

తాళం పగలగొట్టి రూ.8.5 లక్షల విలువైన బంగారం అపహరణ

తుని రూరల్, జూలై 8: తుని కంకిపాటి వారి గురువు వీధిలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది.తుని పట్టణ సీఐ గీత రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం తుని పట్నం కంకిపాటు వారి గరువుకు చెందిన కల్యాణం సత్యమణికుమార్ ఇల్లుకి తాళం వేసి ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి ఇంట్లోప్రవేశించి చోరీకి పాల్పడినట్లు వివరించారు.ఈచోరీలో రూ.8.5లక్షల విలువైన బంగారుఆభరణాలు, వెండి దొంగలించబడ్డాయని బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు

పౌర హక్కుల పరిరక్షణకు శిక్షణ తరగతులు దోహదం

పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ల

కాకినాడలో ప్రారంభమైన ఏఐఎస్ఎఫ్ శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ముప్పాళ్ల సుబ్బారావు

కాకినాడ సిటీ, జూలై 8: రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ఏఐఎస్ఎఫ్ శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయని, విద్యార్థులు ఆ దిశగా పయనించాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు అన్నారు. కాకినాడ సూర్యకళా మందిరంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణా తరగతులను సోమవారం ముప్పాళ్ల ఏఐఎస్ఎఫ్ జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. అనంతరం ఆయన రాజ్యాంగంలో హక్కులు, సమాచార హక్కు చట్టం అనే అంశంపై ప్రసంగిస్తూ రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ ఉద్యమించాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి నూతన విద్యా విధానం-విద్యార్థులపై దాని ప్రభావం అనే అంశంపై మాట్లాడుతూ నూతన విద్యా విధానాన్ని అడ్డుకుందామన్నారు. ఈ విధానం వల్ల దేశంలో ఉన్న సంస్కృతి సంప్రదాయాలు తెలియకుండా పోతున్నాయన్నారు. రాష్ట్ర సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యుడు డేగ ప్రభాకర్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఈ పదేళ్లలో కనీసం 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. మూడోసారి అధికారంలోకి ఇతర మార్గాల్లో వచ్చారన్నారు. ప్రొఫెసర్ సీహెచ్ రాంబాబు నేటి సమాజ పరిణామ క్రమం అనే అంశంపై విద్యార్థుల నుద్దేశించి మాట్లాడారు. ఈ రాజకీయ శిక్షణా తరగతులకు అధ్యక్ష వర్గంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, కావ్య నాగభూషణ్, కుళ్లై స్వామి వ్యవహరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు తాటిపాక మధు, రైతు సంఘం నాయకుడు కె.బోడకొండ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, వివిధ సంఘాల నాయకులు నక్కా శ్రీనివాసరావు, వి.కొండలరావు, పి.సత్యనారాయణ, ఎం.స్టాలిన్ పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సుబ్బారావుచౌదరి



అభినందిస్తున్న మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు



సుబ్బారావుచౌదరి

మండపేట, జూలై 8: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రైస్‌మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కె.గంగవరం మండలం యండగండి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు చుండ్రు వీరవెంకట సత్యసుబ్బారావుచౌదరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మండపేట రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా చుండ్రు వీవీఎస్ఎస్ చౌదరి, కార్యదర్శిగా ఎస్.సత్తిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా ఎన్నికైన చౌదరి 30 ఏళ్లుగా రైస్‌మిల్లు నిర్వహణలో ఉన్నారు. ప్రస్తుతం కపిలేశ్వరపురం మండలం నాగులచెరువు పరిధిలో శ్రీకృష్ణ కిరీటి ఫుడ్ ప్రొడక్ట్స్‌కు మేనేజింగ్ పార్టనర్‌గా వ్యవహరిస్తున్నారు. చౌదరి పెదనాన్న చుండ్రు సూర్య వెంకట సత్యనారాయణమూర్తి గతంలో ఆలమూరు తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా 33 ఏళ్లు ఏకగ్రీవంగా పనిచేశారు. నూతన అధ్యక్షుడు చౌదరిని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఇప్పటివరకు కోనసీమ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేసిన వేగుళ్ల పట్టాభి అభినందించారు. ఈ సందర్భంగా చౌదరి మాట్లాడుతూ రైస్ మిల్లర్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జిల్లాలోని రైస్ మిల్లుల యజమానులు నెక్కంటి శ్రీరామ్‌జీ, గుణ్ణం చరణ్, ఈశ్వరరెడ్డి, కొనగళ్ల సత్యనారాయణ, వంక అన్నవరం, ఐ.ఎస్.ఎన్.చంటిబాబు, వైట్ల దుర్గారావు, మల్లిడి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనంతబాబు దారుణాలపై సీఎంకు 'ముప్పాళ్ల' ఫిర్యాదు

రాజమహేంద్రవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు అనంతబాబు దళితుడైన తన డ్రైవరును అత్యంత పాశవికంగా హతమార్చి మృతదేహాన్ని ఇంటికి పార్సిల్ చేసిన కేసులో త్వరగా కఠిన చర్యలు తీసుకొనేలా చూడాలని కోరుతూ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, డీజీపీ ద్వారకా తిరుమలరావుకు ఈ మెయిల్ ద్వారా విన్నవించినట్టు ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు తెలిపారు. కేసుకు సంబంధించిన అన్ని పత్రాలను పంపించామన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

రాయవరం, జూలై 8: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం మాచవరంలోని ఎం.రామారెడ్డి ఇంట్లో అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచడంతో పౌరసరఫరాలు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. గ్రామంలో పలు ఇళ్ల వద్ద నుంచి పీడీఎస్ బియ్యం రామారెడ్డి కొనుగోలు చేసి పాత ఇంట్లో 41 బస్తాల్లో 2,411 కిలోల బియ్యాన్ని నిల్వ ఉంచారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ రూ.1.09 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన వ్యక్తిపై 7(1) కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎంఎస్‌వో షేక్ అహ్మద్ తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ తాడి జగన్నాథరెడ్డి, ఏవో జె.భార్గవ, మహేష్, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

చెరువులో వృద్ధుడి గల్లంతు

గొల్లప్రోలు రూరల్, జూలై 8: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఏకేమల్లవరం గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు ఆర్ఆర్‌బీ చెరువులో పడి గల్లంతయ్యాడు. గ్రామానికి చెందిన తటవర్తి వేమన్నదొర(68) ఆదివారం సాయంత్రం గేదెలు తోలుకుని ఆర్ఆర్‌బీ చెరువు వద్దకు వెళ్లాడు. తిరిగి వచ్చిన ఒక గేదె కనబడకపోవడంతో మరలా చెరువు వద్దకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో సోమవారం గ్రామస్తులు, కుటుంబసభ్యులు వెతకడం ప్రారంభించారు. ఇతను చెరువులో పడి గల్లంతయినట్లు భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు

రంపచోడవరం, జూలై 8: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ శుక్రవారం స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో అపోలో ఫార్మసీలో ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జి.ప్రశాంత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన 18 సంవత్సరాల నుంచి 30 లోపు ఉన్న నిరుద్యోగ యువతీయువకులు అర్హులన్నారు. ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు జీతం ఇవ్వనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు 93983 38105 నంబరులో సంప్రదించాలన్నారు.

రూ.500 కోట్లు మింగేసిన జగన్ సర్కార్

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్



భూమిపూజ చేస్తున్న సత్యకుమార్‌యాదవ్

అనపర్తి, జూలై 8: రాష్ట్ర ప్రజల ఆరోగ్యం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా అందించిన రూ.500 కోట్ల నిధులను వైసీపీ పాలనలో పేదలకు చేరకుండా మింగేశారని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. అనపర్తిలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని వంద పడకల ఆసుపత్రిగా మార్పు చేసే క్రమంలో రూ.13.85 కోట్ల నిధులతో నిర్మించనున్న అదనపు భవన నిర్మాణానికి ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్, ఎమ్మెల్సీ రామారావుతో కలిసి ఆయన భూమిపూజ నిర్వహించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి సత్యకుమార్‌యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను అనారోగ్య ప్రదేశ్‌గా మార్చిందని, కనీసం సిబ్బందికి జీతాలు కూడా చెల్లించలేదన్నారు. మాజీ సీఎం జగన్ ఆరోగ్యశ్రీ పథకంలో ఉన్న ఆసుపత్రులకు సుమారు రూ.2 వేల కోట్ల బకాయిలు పెట్టారన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఆస్పత్రిలోను మౌలిక సదుపాయాలు కల్పించి ఆంధ్ర ప్రదేశ్‌ను ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ సందర్భంగా మంత్రిని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి ఆధ్వర్యంలో వైద్య బృందం, నాలుగు మండలాల టీడీపీ అధ్యక్షులు, జనసేన నాయకులు, గజమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, కర్రి శేషారత్నం, జుత్తుగ సూర్యకుమారి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పోలీసు అధికారులపై చంద్ర దండు వలంటీర్ ఫిర్యాదు

అనపర్తి, జూలై 8: గత ఏడాది ఫిబ్రవరిలో అనపర్తిలో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన ఇదేం ఖర్మ రాష్ట్రానికి బహిరంగ సభలో తమపై పోలీసులు భౌతిక దాడులు చేశారని వారిపై చర్యలు చేపట్టాలని సోమవారం అనపర్తి పోలీసుస్టేషన్‌లో చంద్ర దండు వలంటీర్ ప్రకాష్‌నాయుడు ఫిర్యాదు చేశారు. చంద్రబాబుకు రక్షణగా చంద్ర దండు పనిచేస్తుందని, నాడు అనపర్తి సభకు వస్తున్న చంద్రబాబును పోలీసులు అడ్డుకుని ఎనిమిది కిలోమీటర్లు నడిపించారన్నారు. అనపర్తిలో జరిగే సభను అడ్డుకోవడమే కాకుండా చంద్రబాబు వద్ద మైక్ లాక్కునే ప్రయత్నం చేసిన పోలీసులను తమ దండు అడ్డుకుందని, ఈ క్రమంలో అప్పటి డీఎస్పీ భక్తవత్సలం, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ అప్పారావు తమను అడ్డుకుని భౌతిక దాడులకు పాల్పడ్డారని, గాయాల పాలైన తమను చంద్రబాబు చొరవతో టీడీపీ నేతలు ఆసుపత్రికి తరలించారని నాయుడు అన్నారు. అప్పుడు ఎంఎల్‌సీ నిర్వహించి స్టేట్‌మెంట్ తీసుకున్న పోలీసులు నేటికీ కేసు నమోదు చేయకపోవడంతో ఈ రోజు మరలా ఫిర్యాదు చేసేందుకు వచ్చానని ప్రకాష్‌నాయుడు అన్నారు. పోలీసు అధికారులు ముగ్గురిపైనే కాకుండా తమపై దాడికి పరోక్షంగా కారకుడైన అప్పటి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై కూడా చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు.

అనకాపల్లి ఎంపీ ప్రత్యేక పూజలు



స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

అన్నవరం, జూలై 8: సత్యదేవుడి సన్నిధిలో సోమవారం అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులతో స్వామిని దర్శించిన ఆయనకు ఆలయ పీఆర్వో కృష్ణారావు ఘన స్వాగతం పలికారు. వేద పండితులు వేదాశీర్వచనాలు అందించగా పీఆర్వో వారికి స్వామివారి ప్రసాదం, మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో గంటా విష్ణు పాల్గొన్నారు.

రూ.50,116 విరాళం

అంతర్వేది, జూలై 8: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దర్శనం అనంతరం రావులపాలెం మండలం గోపాలపురానికి చెందిన మల్లిడి వెంకటహనుమాన్‌సంతోష్‌కుమార్‌రెడ్డి-దేవశ్రీ దంపతులు నిత్యాన్నదానానికి రూ.50,116 విరాళాన్ని ఆలయ అధికారి కిరణ్‌కు అందించారు. దాతలకు ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.80వేలు

ఆత్రేయపురం, జూలై 8: వాడపల్లిలో అన్నదాన భవన నిర్మాణానికి ద్వారకా తిరుమల మండలం ఆర్.వంగిడిగూడేనికి చెందిన వడ్లపూడి హరిబాబు కుటుంబ సభ్యులు రూ.55,520, యానానికి చెందిన కుడుపూడి లోకేశ్‌సమీర్‌సాయిబాబు కుటుంబ సభ్యులు రూ.25,050 విరాళం సమర్పించారు. సోమవారం ఒక్కరోజు ఆదాయం రూ.1,80,782 లభించినట్టు ఉపకమిషనరు భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

రైలు నుంచి జారిపడి గార్డుకు తీవ్రగాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గార్డు దుర్గాప్రసాద్

సామర్లకోట, జూలై 8: యశ్వంత్‌పూర్ నుంచి హౌరా వెళుతున్న సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి జారిపడడంతో రైలు గార్డు తీవ్రంగా గాయపడ్డాడు. సోమవారం తెల్లవారుజామున సామర్లకోట అవుటర్ సిగ్నల్ సమీపాన ఈ ప్రమాదం జరిగింది. రైలులో తన గార్డు విభాగానికి గల హ్యాండిల్ ఊడిపోవడంతో అది పట్టుకున్న గార్డు పట్టుతప్పి వేగంగా వెళుతున్న రైలు నుంచి జారిపడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న సామర్లకోట రైల్వే అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న అతనిని చికిత్స నిమిత్తం అచ్చంపేటలోని మెడికవర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా తీవ్రంగా గాయపడిన గార్డును విజయవాడకు చెందిన వై.దుర్గాప్రసాద్‌గా అధికారులు గుర్తించారు. పక్కటెముకలకు, ముఖానికి తీవ్రంగా గాయాలు కావడంతో తీవ్ర రక్త స్రావం అయ్యిందని వైద్యులు తెలిపారు. సామర్లకోట రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏజెన్సీ సమాచారం

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 47 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

రంపచోడవరం, జూలై 8: ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సుమారు 47 అర్జీలు అందాయని సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఆయన ఐటీడీఏ పరిపాలనాధికారి డీఎన్వీ రమణతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టరు మాట్లాడుతూ బొడ్డగండిలో కమ్యూనిటీ భవనం నిర్మించాలని, మెట్టగూడెం-పులికొండ వరకు మెటల్ రోడ్డు ఏర్పాటు చేయాలని, మంగంపాడు చెక్‌డ్యామ్‌కు మరమ్మతులు చేపట్టాలని, బొడ్డగండి పంచాయతీలో 19 గ్రామాల కొండరెడ్ల కులస్థులకు పక్కా గృహాలు ఏర్పాటు చేయాలని, పొట్లవాడ-కెచ్చెలవాడ కాల్వకు వంతెన ఏర్పాటు చేయాలని, గురుకులగొంది-పాతకోట వరకు మెటల్ రోడ్లు ఏర్పాటు చేయాలని కోరుతూ దరఖాస్తులు అందాయన్నారు. కార్యక్రమంలో డీడీలు జాన్‌రాజ్, షరీఫ్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.దేవేంద్రుడు, ఏడీఎంహెచ్‌వో జి.శిరీష, డీఈవో మల్లేశ్వరరావు, ఏపీడీ ఎ.శ్రీనివాసరావు, డీఎల్‌పీవో రాఘవన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న రాజ్‌కుమార్‌రెడ్డి

రంపచోడవరం, జూలై 8: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టరు పల్లాల రాజ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బాలికలు, బాలుర వసతి గృహాల్లో అధికంగా విద్యార్థులు జాయిన్ అవ్వడం వల్ల సదుపాయాలు సరిపోవడం లేదన్నారు. చాలా మంది విద్యార్థులు వసతులు లేక టీసీలు తీసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. దీనిపై తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని సబ్ కలెక్టరును కోరారు. టీడీపీ మండలాధ్యక్షుడు గురుకు శేషకుమార్, జనసేన మండలాధ్యక్షుడు మల్ల దుర్గాప్రసాద్, కర్రి సన్యాసిరెడ్డి, భీశెట్టి సత్య, కొండ్ల శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధితులకు టీడీపీ నేతల అండ

రాజవొమ్మంగి జూలై 8: జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా బ్లాస్టింగ్ చేస్తుండగా సింగంపల్లి గ్రామ సమీపంలో పల్లి ప్రసాద్ ఇంటిపై బ్లాస్టింగ్ చేసిన రాళ్లు పడి ఇంటి రేకులు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. నిత్యం బ్లాస్టింగ్ చేస్తున్న సమయంలో ప్రసాద్ కుటుంబ సభ్యులు ఇళ్లు వదిలి బయటకు వెళ్లి , బ్లాస్టింగ్ అనంతరం తిరిగి ఇంటిలోకి వెళుతున్నారు. జాతీయ రహదారి నిర్మాణ సిబ్బంది నిర్లక్ష్య సమాధానం చెపుతున్నారని బాధితుడు టీడీపీ నేతలను ఆశ్రయించడంతో సోమవారం టీడీపీ నాయకులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మాజీ సొసైటీ అధ్యక్షుడు గణజాల తాతారావు బాధిత కుటుంబం నుంచి వివరాలు తెలుసుకొని జాతీయ రహదారి నిర్మాణ కాంట్రాక్టర్‌తో మాట్లాడగా ఆ ప్రదేశంలో పని త్వరగా ముగించి, బాధితుడి ఇంటికి కొత్త రేకులు వేస్తానని కాంట్రాక్టర్ తెలిపినట్లు టీడీపీ నేతలు చెప్పారు. టీడీపీ నాయకులు వాసంశెట్టి గంగాధర్, చెక్కా పండుబాబు, తెలుగు యువత మండలాధ్యక్షుడు బారంగి అనుదీప్, కంటపురెడ్డి వీరబాబు, తెడ్ల రాంబాబు, మాజీ సర్పంచ్ కోహూరి రత్నం, గణజాల మల్లికార్జున, సాగి చిన్నమ్ములు, రేలంగి శ్రీను ఉన్నారు.

ఉచిత ఇసుక విధానంతో ఆర్థిక భారం తగ్గుతుంది



ఎటపాక, జూలై 8: ప్రభుత్వం నూతనంగా అమల్లోకి తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానంతో గృహ నిర్మాణదారులకు ఆర్థిక భారం తగ్గుతుందని పీవో కావూరి చైతన్య చెప్పారు. గుండాల ఇసుక డిపో పాయింట్ -1 వద్ద సోమవారం ఇసుక పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. టన్ను ఇసుక లోడింగ్ చార్జీలతో కలిపి రూ.312 విక్రయిస్తున్నట్లు చెప్పారు. గృహనిర్మాణాదారులు ఈ ఉచిత ఇసుక విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో, అధికారులు పాల్గొన్నారు.

వరద ముందస్తు చర్యలపై వీఆర్ పురంలో గ్రామసభ



గ్రామసభలో మాట్లాడుతున్న తహశీల్దార్

వరరామచంద్రాపురం, జూలై 8: గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకుని మండల కేంద్రం వీఆర్ పురంలో తహశీల్దార్ సయ్యద్ మౌలానాఫాజిల్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్, జడ్పీటీసీ వాళ్ళ రంగారెడ్డి మాట్లాడుతూ గోదావరి వరదల సమయంలో వరద బాధితులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. గ్రామస్తులు మాట్లాడుతూ వరదలకు ముందుగానే దోమతెరలు, కిరోసిన్, టార్పాలిన్స్ సోలార్ లైటు, మూడు నెలలకు సరిపడ రేషన్, నిత్యావసర సరకులు అందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సోడి నర్సమ్మ, పంచాయతీ కార్యదర్శి వీఆర్‌వో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జయంతి వేడుకలు

మోతుగూడెం, జూలై 8: మోతుగూడెం పొల్లూరు గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని పొల్లూరు స్కూల్ పిల్లలకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. సర్పంచ్ ఆకేటి సీత రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి ఈ సందర్భంగా పూలమాల వేసి నివాళులర్పించారు.

వీఆర్వో మృతికి సంతాపం

రంపచోడవరం, జూలై 8: రంపచోడవరంలో వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న ఎం.గణపతిరెడ్డి ఆదివారం గుండెపోటుతో మృతి చెందడంతో సోమవారం రెవెన్యూ ఉద్యోగులు సంతాపం తెలిపారు. రెవెన్యూ శాఖలో ఆయన సేవలు మరువలేనివని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని రెవెన్యూ ఉద్యోగులు మౌనం పాటించారు.

సిటీ బస్సులు నడపాలి: ఎస్ఎఫ్ఐ

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 8: రాజమహేంద్రవరంలో సిటీ బస్సులు నడపాలని ఎస్ఎఫ్ఐ కోరింది. ఈమేరకు సోమవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్బాంకు వినతిపత్రం అందజేశారు. సిటీ బస్సులతో పాటు స్టూడెంట్ స్పెషల్ సర్వీసులు తిప్పాలని, బస్ సౌకర్యం లేకపోవడంతో పల్లకడియం, ఈలకొలను, దొంతమూరు, బాలవరం గ్రామాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, బలభద్రపురం నుంచి ఈ గ్రామాల మీదుగా రాజమహేంద్రవరంనకు బస్సులు నడపాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వై.భాస్కర్, వి.రాంబాబు, కనక అచ్చారావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

1,23 డివిజన్ల పర్యటనలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 8: రాజమహేంద్రవరంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా సమస్యలను పూర్తిస్థాయిలో ప్రభుత్వ పరంగా పరిష్కరించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. సోమవారం నగరంలో 23వ డివిజన్‌లో ఇన్‌ఛార్జి యిన్నమూరి దీప్తు, కార్పొరేషన్ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వాసు మాట్లాడుతూ గుండువారి వీధి, వాటర్ వర్క్స్ వీధి, చందసత్రం వీధుల్లో రోడ్లు మరమ్మతులు, నీటి కుళాయిలు, వీధి దీపాలు, మ్యాన్‌హోల్స్ వంటి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అలాగే నగరంలో మహిళల భద్రతకు చర్యలు తీసుకుంటున్నామని, బ్లేడ్ బ్యాచ్‌లు, గంజాయి బ్యాచ్‌లను అరికడుతున్నామన్నారు. అనంతరం 1వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ కడలి రామకృష్ణతో కలిసి పర్యటించారు. ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఇదిలా ఉండగా లాలాచెరువు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎమ్మెల్యే వాసు స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం కుటుంబంలో ఒక్కరికే అమ్మఒడి ఇచ్చిందని కూటమి ప్రభుత్వం అమ్మకు వందనం కార్యక్రమం ద్వారా ఇంట్లో చదుకుంటున్న పిల్లలందరి తల్లుల ఖాతాలో సొమ్ము జమచేయనున్నట్లు చెప్పారు. అనంతరం ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో మొక్కను నాటారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్.సుభాషిణి, టీడీపీ నాయకులు కాశి నవీన్‌కుమార్, మరుకుర్తి రవియాదవ్, హరి బెనర్జీ, చింతపల్లి నాని, అర్బన్ ఎమ్ఈవో-2 రమా రజని, హెచ్ఎం ఎ.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



23వ డివిజన్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి

నాలుగేళ్లుగా గ్రామ సభల్లేవ్

- సమస్యలు చెప్పుకునే అవకాశం లేదు
- డ్రైనేజీలో పూడిక తీతల్లేవ్
- కుళాయిల నుంచి రంగు మారిన నీరు
- అధికారులను నిలదీసిన చినకొండేపూడి గ్రామస్థులు



సీతానగరంలో జరిగిన గ్రామ సభ దృశ్యం

సీతానగరం, జూలై 8: గత నాలుగేళ్లలో గ్రామ సభలు నిర్వహించలేదని, అందుచేత సమస్యలు చెప్పుకునే అవకాశం లేకపోయిందని పలువురు అన్నారు. సోమవారం చినకొండేపూడి పంచాయతీ ఆవరణలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్లమూరు ఏసురాజు, కోసూరి రవికుమార్, రాజు మాట్లాడుతూ నాలుగేళ్లుగా డ్రైనేజీలో పూడికతీతలు లేవని, కనీసం బ్లీచింగ్ కూడా జల్లడం లేదని, వీధులు శుభ్రం చేయడం లేదని సర్పంచ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎస్సీ పేటలో పంచాయతీ కుళాయిల నుంచి వస్తున్న నీరు రంగు మారుతోందని, దీని వల్ల అంటువ్యాధులు ప్రబలే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. పైప్‌లైన్ లీకేజీలు ఉన్నాయని, వాటి ద్వారా బురదనీరు, రోడ్లపై నీరు.. తాగునీటిలో కలుస్తోందని అన్నారు. అయితే ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తిచేస్తామని సర్పంచ్ చేకూరి శ్రీనివాస్ పాల్, కార్యదర్శి సత్యాదేవి చెప్పారు. అయితే అమూల్ బల్క్‌మిల్క్ సెంటర్‌కు స్థలం కేటాయిస్తూ తమ పొలానికి వెళ్లే దారిలో ఉన్న భూమికి పంచాయతీ ఎలా తీర్మానం చేస్తుందని వడ్లమూరి సోమరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ సభలు నిర్వహించకుండానే నిర్వహించినట్లు రాసుకుంటున్నారని పలువురు విమర్శించారు. కార్యక్రమంలో చేకూరి సత్తిపండురాజు, కాండ్రు శేఖర్, రామకృష్ణరాజు, వడ్లమూరు సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జయంతి

- దివంగత ముఖ్యమంత్రికి పలువురి ఘన నివాళి



కోరుకొండలో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గోకవరం, జూలై 8: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిరస్మరణీయుడని మాజీ మంత్రి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట నరసింహం అన్నారు. గోకవరంలో సోమవారం నిర్వహించిన రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని పాతబస్టాండ్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. రాష్ట్ర అభ్యున్నతికి రాజశేఖర్ రెడ్డి సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో నాయకులు తోట రాంజీ, పాటి రాంబాబు, దాసరి చినబాబు, వరసాల ప్రసాద్, గుల్లా ఏడుకొండలు, సుంకర వీరబాబు, బదిరెడ్డి అప్పన్నదొర, ఉంగరాల ఆదివిష్ణు పాల్గొన్నారు.

సీతానగరం: సీతానగరంలో మథర్ థెరిస్సా సెంటర్ వద్ద పెదపాటి రమేష్ బాబు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం కోరుకొండలో జరిగిన బ్లడ్ డొనేషన్ క్యాంపులో పాల్గొని 127వ సారి రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఘంటా శ్రీనివాసరావు, వలవల వెంకట్రాజు, వలవల సత్యనారాయణ, మట్ట శ్రీను పాల్గొన్నారు.

రంగంపేట: రంగంపేటలో వైఎస్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పూలమాలలతో నివాళులర్పించారు. ముఖ్యమంత్రిగా రాజశేఖర్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల హృదయాల్లో ఆత్మబంధువుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పేపకాయల రాంబాబు, కొల్లాటి ఇశ్రాయేలు, పోతుల బులివీర్రాజు, అడబాల వెంకటేశ్వరరావు, నల్లా శ్రీనివాసరావు, పాలాటి నాగేశ్వరరావు, మత్సా బుజ్జి పాల్గొన్నారు.

బిక్కవోలు: బిక్కవోలులో వైఎస్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పూలమాలతో నివాళులర్పించారు. ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పోతుల ప్రసాదరెడ్డి, గువ్వల సత్తిరెడ్డి, తమ్మిరెడ్డి నాగశ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ: కోరుకొండ వైసీపీ కార్యాలయంలో జక్కంపూడి రామ్మోహన్ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి జరిపారు. ఆయన చిత్రపటానికి పూలమాల నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఫౌండేషన్ నిర్వాహకులు జక్కంపూడి రాజశ్రీతోపాటు వైసీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, పలువురు వైసీపీ నాయకులు రక్తదానం చేశారు.

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక కృష్ణనగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద వైఎస్సార్ చిత్రపటానికి నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ పూలమాలతో నివాళులర్పించి, పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బెజవాడ రంగారావు, బత్తిన చంద్రరావు, కిషోర్ కుమార్‌జైన్, చామర్తి లీలావతి, ఇజ్జరౌతు సత్యనారాయణ, మండా రాజు పాల్గొన్నారు.

గోదావరి నీటి కాలుష్య నివారణకు కృషి

పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 8: గోదావరి నీటి కాలుష్య నివారణకు కృషి చేస్తానని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం స్థానిక పుష్కర్‌ఘాట్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద గోదావరి పరిరక్షణ సమితి తృతీయ వార్షికోత్సవం సందర్భంగా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ అఖండ గోదావరి పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యం వల్ల కలుషితమైపోతోందని, దానిని నివారించాలన్నారు. రాజమండ్రి పుర ప్రముఖులందరూ కలిసికట్టుగా పనిచేసి గోదావరి జలాల కాలుష్య నివారణకు చర్యలు చేపడదామన్నారు. డాక్టర్ కర్రి రామారెడ్డి మాట్లాడుతూ, మనం అనారోగ్యం పాలవడానికి కలుషిత నీరే కారణమని, గోదావరి నీటిని కాలుష్యం కాకుండా నివారణ చర్యలు తీసుకోవడం అత్యంత ఆవశ్యకమన్నారు. కార్యక్రమంలో ఆదిరెడ్డి అప్పారావు, కళగౌతమి బీవీ ఎస్ మూర్తి, ఓఎన్‌జీసీ రిటైర్డ్ జీఎం. డీఎంకే శేఖర్, పంతం కొండలరావు, జిత్ మోహన్‌మిత్ర, చల్లా సత్యవాణి, అనుశ్రీ సత్యనారాయణ, బలరామనాయుడు పాల్గొన్నారు. అనంతరం పేదలకు రగ్గులు, చీరలు పంచిపెట్టారు.

ఆర్ట్స్ కళాశాలలో పరిశోధనలకు ఆర్థికసాయం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 8: ఆర్ట్స్ కళాశాలలో వివిధ విభాగాల్లో పరిశోధనల కోసం అధ్యాపకులకు ఆర్థిక సాయం అందిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు తెలిపారు. కళాశాల అంతర్గత నిధుల నుంచి సమీకరించి మొత్తం 13 మంది అధ్యాపకులకు తగినంత ఆర్థిక సాయాన్ని ఇస్తున్నామని, 18 నెలల గడువులో ప్రాజెక్టును పూర్తి చేసేలా సమయం ఇవ్వడం జరుగుతున్నదని తెలిపారు. రసాయనశాస్త్రంలో నాలుగు, భౌతికశాస్త్రంలో మూడు, వాణిజ్యశాస్త్రంలో రెండు, వృక్షశాస్త్రంలో ఒకటి, అర్థశాస్త్రంలో ఒకటి, మేథమెటిక్స్‌లో ఒకటి, ఆంగ్లశాస్త్రంలో ఒక పరిశోధన మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు.

ఎంపీ పురందేశ్వరిని కలిసిన కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 8: రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని సోమవారం సాయంత్రం మునిసిపల్ కమిషనర్ దినేష్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మొక్కను అందించారు.

జిల్లాలో 14.2 మి.మీ వర్షపాతం

రాజమహేంద్రవరం సిటీ, జూలై 8: జిల్లాలో మొత్తం 14.2 మి.మీ వర్షపాతం నమోదైందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అత్యధికంగా సీతానగరంలో 4.2 మి.మీ నమోదు కాగా, అత్యల్పంగా బిక్కవోలులో 0.2 మి.మీ వర్షపాతం నమోదైందని తెలిపారు. కోరుకొండలో 1.2 మి.మీ, కడియంలో 0.4 మి.మీ, రాజమహేంద్రవరం రూరల్‌లో 2.2 మి.మీ, అర్బన్‌లో 1.8 మి.మీ నమోదయ్యింది. కొవ్వూరు డివిజన్‌లో గోపాలపురంలో 2.0 మి.మీ, నిడదవోలులో 1.0 మి.మీ, తాళ్ళపూడిలో 1.2 మి.మీ వర్షపాతం నమోదయ్యింది. మిగిలిన మండలాల్లో వాతావరణం మబ్బుగా వుంది.

ఎమ్మెల్యే వాసును విమర్శించే అర్హత భరత్‌కు లేదు

తెలుగు యువత నేతలు నక్కా యిన్నమూరి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 8: నిరంతరం ప్రజలు మధ్య వుండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసే ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను విమర్శించే స్థాయి, అర్హత భరత్‌రామ్‌కు లేదని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవీవరప్రసాద్ అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో యిన్నమూరి దీప్తు, దాస్యం ప్రసాద్‌తో కలిసి ఆయన మాట్లాడారు. భరత్ ఎంపీగా వెలగబెట్టిన ఘనకార్యాల చిట్టా చాలా వుందని తొందర పడకుండా వుంటే అన్నీ బయటకు తీస్తారన్నారు. రాజమహేంద్రవరం ప్రజలు ఇప్పటికే తిరస్కరించారని, వాసును 72వేల మేజార్టీతో తమ గెలిపించారన్నారు. భరత్ ఇంకా ఎంపీగా ఉన్నట్లు భ్రమల్లో ఉన్నారని, దాని నుంచి వాస్తవ ప్రపంచంలోకి వస్తే అన్నీ అర్థమౌతాయన్నారు.

రామవరంలో హోమియో వైద్యశాల పరిశీలన

అనపర్తి, జూలై 8: రామవరంలో సిబ్బంది కొరతతో మూడపడ్డ హోమియో వైద్యశాలను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్.. ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో కలిసి పరిశీలించారు. సోమవారం అనపర్తి పర్యటను వచ్చిన మంత్రికి హోమియో ఆసుపత్రి పరిస్థితిని ఎమ్మెల్యే వివరించారు. ఆసుపత్రిని పరిశీలించిన మంత్రి నూతన భవనం నిర్మించే వరకు స్థానిక ఆయుష్ ఆసుపత్రిలో హోమియో సేవలందే విధంగా చర్యలు చేపడతామన్నారు. మంత్రి వెంట రీజనల్ డైరెక్టర్ పి.పద్మశశిధర్, డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ ఎన్.పద్మశ్రీ రాణి తదితరులున్నారు. ఇదిలా ఉండగా తమ సమస్యలను పరిష్కరించాలంటూ 108 ఉద్యోగుల రాష్ట్ర నాయకులు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. 108 సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వాహనాల నిర్వహణను ప్రభుత్వమే చేపట్టాలనే తదితర అంశాలను వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో మురళీకృష్ణ, ఆదినారాయణ, ఆనంద్, శ్రీమన్నారాయణ, అర్జున్ పాల్గొన్నారు.


ఎస్పీ గ్రీవెన్స్‌కు 27 అర్జీలు

రాజమహేంద్రవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టం(మీ కోసం)ను నిర్వహించారు. ఎస్పీ జగదీశ్ స్వయంగా ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి వారి సమస్యలపై ఆరా తీశారు. జూమ్ విధానంలో ఫిర్యాదుదారుల సమక్షంలో ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులతో మాట్లాడి తగు ఆదేశాలను జారీ చేశారు. చట్ట ప్రకారం ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని పేర్కొన్నారు. మొత్తం 27 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. కాగా.. ఎస్పీకి ఫిర్యాదు చేసిన తర్వాత కూడా సదరు సమస్య క్షేత్ర స్థాయిలో పరిష్కారం కాకపోవడంతో అర్జీదారులు రెండోసారి తన గోడు విన్నవించుకోవడానికి జిల్లా పోలీసు కార్యాలయానికి వస్తున్నారు. మహిళపై దాడి చేసిన ఓ ఘటనలో నల్లజర్లకు చెందిన ఓ అర్జీ దారుడు సోమవారం రెండోసారి ఎస్పీ వద్దకు వచ్చాడు. దీనిపై తీవ్రంగా స్పందించిన ఎస్పీ.. అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది.

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 22 అర్జీలు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 8: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 22 అర్జీలు వచ్చాయి. అడిషనల్ కమిషనర్ సత్యవేణి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. డ్రైనేజీ, మురుగునీటి పారుదల, తాగునీరు, టిడ్కో ఇళ్లు, ఇంటి పన్ను, వీధి దీపాలు, సరిహద్దు సమస్యలపై అర్జీలు వచ్చాయని ఆమె తెలిపారు. స్థానిక ఉల్లితోట వీధికి చెందిన జి.రాధాకృష్ణ తమ వీధిలో మునిసిపల్ వాటర్ పైప్‌లైన్ లీకేజీ సమస్య వుందని దానిని పరిష్కరించాలని విజ్ఞప్తి చేసారు. సమస్యల పరిష్కరానికి చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు.

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా వెంకటరెడ్డి



అనపర్తి, జూలై 8: రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని రామవరం గ్రామానికి చెందిన కర్రి వెంకటరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన జిల్లా అసోసియేషన్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటరెడ్డి, కార్యదర్శిగా మల్లిడి రామ్మూర్తిరెడ్డి, ట్రెజరర్‌గా బలుసు శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా సూరపురెడ్డి వీర్రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ నూతన కార్యవర్గం ఏర్పాటైన సందర్భంగా ఈ నెల 10న అనపర్తిలోని ఎస్ఎన్ఆర్ కళ్యాణ మండపంలో ఉదయం 11గంటలకు సమావేశం ఏర్పాటు చేస్తున్నామని, రైస్‌మిల్లర్లు తప్పక హాజరు కావాలని కోరారు.

పురుగు మందుల దుకాణంలో విజిలెన్స్ దాడి

రాజానగరం, జూలై 8: రాజానగరంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణంలో విజిలెన్స్ అధికారులు సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఏవో షేక్ ఇమామి ఖాసిం వివరాల మేరకు.. గ్రామంలో శ్రీవేంకటేశ్వర జనరల్ స్టోర్‌లో గడువు తీరిన, పురుగు మందులను నాట్ ఫర్ సేల్ అని బోర్డు పెట్టి గదిలో ఉంచిన స్టాకును గుర్తించామన్నారు. దీని విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని, దీనిని డిస్పోజల్ చేసేందుకు పై అధికారులకు నివేదిస్తామన్నారు. ఈ దాడిలో ఏడీఏ డి.శ్రీనివాసరెడ్డి, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్.. ఎస్సీ బాలికల హాస్టల్ తనిఖీ



రాజమహేంద్రవరం అర్బన్, జూలై 8: రాజమహేంద్రవరంలోని గణేష్‌చౌక్‌లో ప్రభుత్వ ఎస్సీ బాలికల హాస్టల్‌ను కలెక్టర్ పి.ప్రశాంతి సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ వార్డెన్, ఇతర సహాయక సిబ్బంది అందిస్తున్న వసతుల విషయంలో బాలికల నుంచి సమాచారం సేకరించారు. మెనూ ప్రకారం ఆహార పదార్థాలు పెడుతున్నారా లేదా అని ఆరా తీశారు. స్టడీ అవర్, మరుగుదొడ్ల నిర్వహణ, లైటింగ్ తదితర అంశాలకు సంబంధించిన వివరాలను బాలికలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం చక్కటి సౌకర్యాలను హాస్టళ్లలో కల్పిస్తున్నారని, ఉచితంగా పుస్తకాలు ఇస్తున్నారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కలెక్టర్ వెంట అధికారులు ఉన్నారు.

జీజీహెచ్ జలగలపై విచారణకు కమిటీ

సూపర్‌వైజర్ తొలగింపు, కొత్త ఎంఎన్‌వోకు ఇన్‌ఛార్జి బాధ్యతలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 8: రోగుల రక్తాన్ని సైతం తాగేస్తున్న రాజమహేంద్రవరం జీజీహెచ్‌లోని అవినీతి జలగలపై అధికారులు ఎట్టకేలకు స్పందించి విచారణకు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ ఒక ఎంక్వయిరీ కమిటీని నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జీజీహెచ్‌లో ఎంఎన్‌వో విభాగంలోని జలగలపై ఇటీవల ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంఎన్‌వోను సూపర్‌వైజర్ విధుల నుంచి తప్పించి ఆ స్థానంలో మరో ఎంఎన్‌వో ఆర్‌వీకే భీమేశ్వరరావుకు సూపర్‌వైజర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మళ్లీ ఉత్తర్వులు జారీ చేసే వరకూ ఆ బాధ్యతల్లో కొనసాగాలని సూచించారు. ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని సూపరింటెండెంట్ పేర్కొన్నారు.

నేడు రంగంపేట సర్వసభ్య సమావేశం

రంగంపేట, జూలై 8: రంగంపేట మండల సర్వసభ్య సాధారణ సమావేశం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉదయం 10గంటలకు ఎంపీపీ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో పి.వెంకటరత్నం తెలిపారు. మండలంలోని అధికారులంతా పూర్తి సమాచారంతో తప్పక హాజరు కావాలని, సమావేశానికి హాజరుకాని వారిపై చర్యల నిమిత్తం శాఖాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

బిక్కవోలు, జూలై 8: మండలంలోని ఆర్ఎస్ పేటలో గర్భిణులకు, బాలింతలకు సోమవారం టీడీపీ నాయకులు పౌష్టికాహారం పంపిణీ చేశారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల గర్భిణులు ఆరోగ్యవంతమైన శిశువులకు జన్మనిస్తారన్నారు. కార్యక్రమంలో మాడా మోహన్, బోను సూర్యకుమార్, సప్పా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాకిట్లు పంపిణీ

కడియం, జూలై 7: మండలంలోని కడియం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ విద్యాకిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని, వనుం సూరిబాబు, హెచ్ఎం టి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే మాధవరాయుడుపాలెం చైతన్యనగర్‌లో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ అన్నందేవుల చంటి, ఎంపీటీసీ గొల్లపల్లి వెంకటేశ్వరరావు, దుళ్ల ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుర్రపు సత్యనారాయణ, తోకల శ్రీను, యర్రా సత్యనారాయణ, కాయల సత్యనారాయణ, హెచ్ఎం బి.సంధ్యారాణి పాల్గొన్నారు.

మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఘన స్వాగతం

కోరుకొండ, జూలై 8: జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం మధురపూడి విమానాశ్రయానికి విచ్చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు పలువురు అధికారులు, బీజేపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నీరుకొండ వీరన్నచౌదరి, ఏపీఆర్ చౌదరి, మోదీ సత్తిబాబు, గణపతి, నరసింహమూర్తి తదితరులు మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం ఆయన అనపర్తి వెళ్లారు.

నన్నయ వర్సిటీపై విచారణ జరిపించాలి

మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కోరుకొండ, జూలై 8: నన్నయ యూనివర్సిటీపై ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఇటీవల చేసిన ఆరోపణలపై మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఘాటుగా స్పందించారు. 2014 నుంచి 2024 వరకు యూనివర్సిటీలో జరిగిన ప్రతీ అంశంపై విచారించాలన్నారు. సోమవారం కోరుకొండలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. నన్నయ యూనివర్సిటీలో గత ఐదేళ్లలో బంధువులకు కాంట్రాక్టులు ఇచ్చుకున్నారని, అక్రమాలు జరిగాయని ఎమ్మెల్యే బత్తుల ఆరోపిస్తూ సీబీడీ విచారణ కోరతామని ప్రకటించడాన్ని ఆయన విమర్శించారు. వర్సిటీలు పలు సౌకర్యాలు కల్పించడానికి ప్రయత్నాలు జరిగాయని, నిధులు కోసం డిపార్టుమెంట్ చుట్టూ తిరిగామని, అంతర్గత నిధులు ఉపయోగించుకోవడానికి అనుమతి అయినా ఇప్పించాలని కోరామని పేర్కొన్నారు. పలు భవనాలు నిర్మించామని చెప్పారు. ఎన్నికల కారణంగా ఆరు మాసాల నుంచి సరైన దృష్టి పెట్టలేకపోయామన్నారు. సమావేశంలో గుమ్ముళ్ళూరు సర్పంచ్ నక్కా రాంబాబు, జడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, గణేశుల పోసియ్య, కంటే వినయ్‌తేజ, దేవ కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: ఓఎంజీ(ఓ మంచి ఘోస్ట్)
సూర్యామినీ	: నింద
సూర్యాప్యాలస్	: హరోంహర
స్వామి	: మహరాజ
శివజ్యోతి	: ఎ
అనుశ్రీ(సాయికృష్ణ)	: మనమే
రాజా	: బ్యాడ్ బాయ్స్
ఊర్వశి	: అంతిమ తీర్పు
రంభ	: కేజీఎఫ్-1
మేనక	: ప్రేమ కథా చిత్రమ్
అప్సర	: ప్రభుత్వ జూనియర్ కళాశాల
కుమారి	: హనీమూన్ ఎక్స్‌ప్రెస్
వీఎస్ మహాల్(నామవరం)	: మహరాజ
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: మహరాజ
వెంకటసూర్య(కడియం)	: ----
సత్యగౌరి (అనపర్తి)	: హరోంహర
సూర్యశ్రీ (అనపర్తి)	: ఆ ఒక్కటీ అడక్కు
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: మహరాజ
రామకృష్ణ(కోరుకొండ)	: ----
గీతాసినిమాస్ (సీతానగరం)	: హరోంహర
శ్రీనివాస (గోకవరం)	: హరోంహర
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ---
లలితామహాల్(రంపచోడవరం)	: హరోంహర
నవయుగ(చింతూరు)	: ----

హైదరాబాద్‌లో ఉద్యోగం చూసుకుని భర్తతోపాటు అక్కడే పిల్లలతో కలిసి సంతోషంగా ఉండొచ్చన్న ఆమె ఆశలు అడియాసలయ్యాయి. ఏడాదికి రూ.15 లక్షల ప్యాకేజీతో ఉద్యోగానికి ఎంపికైన ఆనందం కొన్ని గంటలు గడవక ముందే ఆవిరైంది. కారు డ్రైవర్ నిద్రమత్తు, అతివేగం.. ఆమెతోపాటు కుమారుడిని, తల్లిని బలి తీసుకుంది. ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలం లక్ష్మీనగర్ జాతీయ రహదారిపై జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిది తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని రాజవోలు గ్రామం. దీంతో ఆ గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు నెలకొన్నాయి.

చెదిరిన కల!

- రూ.15 లక్షల జీతంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి మహిళ ఎంపిక
- ఆనందంతో హైదరాబాద్ నుంచి రాజవోలుకు ప్రయాణం
- లక్ష్మీ నగర్ వద్ద ఆగి ఉన్న ట్రాలీ లారీని ఢీకొన్న కారు
- తల్లి, కుమారుడు సహా మహిళ మృతి.. ఇద్దరికి గాయాలు
- డ్రైవర్ నిద్రమత్తు.. అతివేగమే ప్రమాదానికి కారణం







రోడ్డు ప్రమాద దృశ్యం.. కారులో మృతదేహాలు, తీవ్రంగా గాయపడిన డ్రైవర్.. ఇద్దరు కుమారులు నితిన్, షణ్ముఖిలతో తల్లిదండ్రులు నాగార్జున, భాగ్యశ్రీ (ఫైల్)

ద్వారకాతిరుమల/రాజమహేంద్రవరం రూరల్/సిటీ, జూలై8: రోడ్డు ప్రమాదం.. ఒక కుటుంబంలో తల్లిని, కుమార్తెను, మనవడిని బలితీసుకుంది. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి రూరల్ మండలం రాజవోలుకు చెందిన రాచబత్తుని నాగార్జున, భాగ్యశ్రీ దంపతులకు ఇద్దరు కుమారులు నాగ షణ్ముఖి, నాగ నితిన్‌కుమార్ ఉన్నారు. నాగార్జున హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ నిర్వహిస్తూ అతను ఒక్కడే అక్కడ ఉంటున్నాడు. గ్రామంలోనే పిల్లలతోపాటు ఉంటున్న భాగ్యశ్రీ తనకు హైదరాబాద్‌లో ఉద్యోగం వస్తే భర్త వద్దకు వెళ్లే ప్రయత్నాల్లో ఉంది. ఈ నేపథ్యంలోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇంటర్వ్యూ నిమిత్తం రెండు రోజుల కిందట హైదరాబాద్‌కు ఇద్దరు కుమారులతో పాటు భీమవరానికి చెందిన ఆమె తల్లిదండ్రులు బొమ్మా నారాయణరావు, కమలాదేవితో కలిసి వెళ్లారు. అక్కడ ఇంటర్వ్యూ పూర్తి చేసుకుని ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులతో కలిసి భాగ్యశ్రీ ఆదివారం రాత్రి హైదరాబాద్ నుంచి రాజవోలుకు ప్రయాణమైంది. భర్త నాగార్జున పనిపై అక్కడే ఆగిపోగా, తండ్రి నారాయణరావు కూడా విజయవాడలో కారు దిగి పోయారు. తర్వాత ఆయన ట్రైన్‌లో భీమవరం వెళ్లిపోయారు. మిగిలిన వారు రాజవోలు బయలుదేరారు. సోమవారం తెల్లవారుజామున ద్వారకాతిరుమల మండలం లక్ష్మీనగర్ వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉన్న చెన్నై నుంచి కాకినాడకు వెళ్తున్న మిషనరీ లోడు ట్రాలీ లారీని కారు వేగంగా వెనుక నుంచి ఢీకొట్టి ట్రాలీలోకి దూసుకుపోయింది. క్రేన్ సహాయంతో కారును బయటకు తీశారు. భాగ్యశ్రీ (27), నితిన్ కుమార్(4), కమలాదేవి (55) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలైన కొవ్వూరు మండలం వాడపల్లికి చెందిన డ్రైవర్ దుర్గావంశీ, చిన్నారి నాగ షణ్ముఖిలను స్థానికులు బయటకు తీసి అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ వంశీ పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ఎస్పీ మేరీ ప్రశాంతి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. భీమడోలు సీఐ బి.బి.రవికుమార్, పోలీసు సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ప్రమాదానికి కారణమేమిటి..

ఘటనా స్థలంలో సీసీ ఫుటేజీని పరిశీలిస్తే సరిగ్గా ఉదయం 5.42 గంటలకు వీరు ప్రయాణిస్తున్న ఎర్టికా కారు రోడ్డుపై మెలికలు తిరుగుతూ పక్కన ఆపి ఉంచిన కంటైనర్ లారీని అతివేగంతో ఢీకొట్టింది. డ్రైవర్ దుర్గావంశీ నిద్రమత్తు, అతివేగం లేక వేరే కారణం ఏమైనా ఉందా? అనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. నిబంధనలకు విరుద్ధంగా జాతీయ రహదారి పక్కన కంటెయినర్‌ను ఆపడం వల్లే ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు.

విషాదఛాయలు

భాగ్యశ్రీతోపాటు ఆమె కుమారుడు నితిన్, తల్లి కమలాదేవిల మృతితో రాజవోలు, భీమవరంలలో విషాదఛాయలు నెలకొన్నాయి. గుంటూరు జిల్లా భట్టిప్రోలుకు చెందిన నాగార్జునకు భీమవరానికి చెందిన భాగ్యశ్రీకి వివాహం కాగా, వీరి ఇద్దరి కుమారులతో కొన్నాళ్లుగా రాజవోలులోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. భాగ్యశ్రీ తన భర్తకు చేదోడుగా ఉండి కుటుంబాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు హైదరాబాద్ వెళ్లిపోయి అక్కడే ఉద్యోగం చేయాలని నిర్ణయించి ఇంటర్వ్యూకి వెళ్లింది. ఏడాదికి రూ.15 లక్షల ప్యాకేజీతో ఎంపికైంది. దీంతో కుటుంబ సభ్యులంతా సంతోషంగా ఉన్నారు. ఆ ఆనందం కొన్ని గంటలు గడవక ముందే ఆ ఇంట విషాదం అలుముకుంది. బంధువులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు.

పోస్టుమార్టం పూర్తి.. బంధువులకు అప్పగింత

ఏలూరు క్రైం : ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో కమలాదేవి, భాగ్యశ్రీ, నితిన్‌కుమార్ మృతదేహాలకు భీమడోలు సీఐ రవికుమార్, ద్వారకాతిరుమల ఎస్ఐ సతీష్, ఏఎస్ఐ రాగిరి రాంబాబు శవ పంచనామా నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రి ఇన్‌ఛార్జి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పీఏఆర్ఎస్ శ్రీనివాసరావు ఆదేశాలతో ఆర్ఎంవో డాక్టర్ ప్రసాదొరెడ్డి ఆధ్వర్యంలో మృతదేహాలకు వైద్య నిపుణుల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.



ఇసుక రెడీ!

పెరవలి మండలం తీపర్రు - ఉసులుమర్రు స్టాక్ పాయింట్ వద్ద ఇసుక ఎగుమతికి సిద్ధంగా ఉంచిన ఎక్స్‌కవేటర్

- స్టాక్ పాయింట్లలో టన్ను ఇసుక రూ.270
- గతంలో టన్ను ఇసుకను రూ.950 వరకూ విక్రయం
- ఈ ఇసుకను ఇళ్ల నిర్మాణాలకు సరఫరా చేస్తాం : కలెక్టర్ వెల్లడి
- ఇసుక కావాల్సినవారు సచివాలయ సెక్రటరీ సర్టిఫికెట్ తెచ్చుకోవాలి : కొవ్వూరు సబ్ కలెక్టర్
- తొలిరోజు క్షేత్రస్థాయిలో ప్రారంభం కాని ఇసుక అమ్మకాలు

రాజమహేంద్రవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): స్టాక్ పాయింట్లలో టన్ను ఇసుకకు రూ.270 వంతున తీసుకుని పంపిణీ చేయాలని జిల్లా అధికారులు నిర్ణయించారు. సీనరేజీ, తవ్వకం, లోడింగ్, రీ లోడింగ్, ర్యాంపు నుంచి స్టాక్ పాయింట్ దాకా రవాణా చార్జీలు, జీఎస్టీ, డీఎంఎఫ్ వంటి చార్జీలని కలుపుకుని టన్నుకు రూ.270 నిర్ణయించారు. జిల్లాలోని రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్లలోని మొత్తం 7 స్టాక్ పాయింట్లలోనూ ఇదే ధర నిర్ణయించారు. గత ప్రభుత్వంలో పాలనాపరమైన చార్జీలు ఎగ్గొట్టి కూడా స్టాక్ పాయింట్ల వద్ద టన్ను ఇసుకను రూ.950 వరకూ విక్రయించడం గమనార్హం. సోమవారం స్టాక్ పాయింట్ల వద్ద అమ్మకాలు జరగలేదు. ప్రభుత్వ జీవో జిల్లా అధికార్లకు ఆలస్యంగా అందడం, దాని ప్రకారం ధర నిర్ణయించడానికి సమయం పట్టడంతో మంగళవారం నుంచి స్టాక్ పాయింట్ల వద్ద ఉచిత ఇసుక పంపిణీ మొదలు కానుంది.

ఆ .. ఇసుకను ఇళ్ల నిర్మాణాలకు సరఫరా చేస్తాం

గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల్లో డీసిల్టేషన్ కింద తీసి స్టాక్ పెట్టిన ఇసుకను ఉచిత ఇసుక విధానంలో గృహనిర్మాణాలకు సరఫరా చేయడానికి సన్నద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికార్లను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆమె కాతేరు, గాయత్రీ ర్యాంపులను ఆకస్మికంగా తనిఖీచేసి, అక్కడి బోట్స్‌మన్ సొసైటీ సభ్యులతో ముఖాముఖీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పంపిణీ విధానం అమలులో భాగంగా కేవలం పరిపాలనాపరమైన ఖర్చులు మాత్రమే నిర్ణయించి వసూలు చేస్తుందని ఆమె వివరించారు. ప్రస్తుతం గోదావరి నదికి వరద సీజన్ కాబట్టి, ర్యాంపుల్లోని ఇసుక స్టాక్ పంపిణీని వేగవంతం చేయాలన్నారు. బోట్స్‌మన్‌తీసే ఇసుక రవాణా తదితర అంశాలపై సభ్యులతో ఆమె చర్చించారు. ఇక్కడ సుమారు 250కి పైగా బోట్లు ఉన్నాయని, వాటి ద్వారా రోజుకు 4 నుంచి 5 ట్రిప్పుల ఇసుక తీస్తామని, ఒక యూనిట్ కోసం 450 బకెట్లు ఇసుక తీస్తామని, రెండు గంటల సమయంలో 5 యూనిట్ల వరకూ ఇసుక తోడగలమని వారు కలెక్టర్‌కు వివరించారు. ఈ తనిఖీలలో మున్సిపల్ కమిషనర్ జిల్లా ఇన్‌చార్జి జేసీ, కె.దినేష్‌కుమార్, ఆర్డీవో ఎ.చైత్రవర్షిణీ, మైన్స్ ఏడీ ఎం. సుబ్రహ్మణ్యం, రూరల్ తహశీల్దార్ వైవీ కె.అప్పారావు పాల్గొన్నారు.

తొలి రోజు సన్నద్ధమే కానీ..

పెరవలి, జూలై8: ఉచిత ఇసుక సరఫరాకు ఉన్నతాధికారుల నుంచి ఇంకా ఎటువంటి ఆదేశాలు రాకపోవడంతో పెరవలి మండలం తీపర్రు- ఉసులుమర్రు మధ్య స్టాక్ పాయింట్ నుంచి సోమవారం ఇసుక ఎగుమతులు ప్రారంభంకాలేదు. వాస్తవానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక రెవెన్యూ సిబ్బంది ఇసుక పంపిణీకి ఇక్కడ ఏర్పాట్లు పూర్తిచేశారు. స్టాక్ పాయింట్ పక్కనే గల ఓ ప్రైవేటు గొడౌన్‌లో కంప్యూటర్‌ను ఏర్పాటుచేశారు. నెట్ సౌకర్యం కోసం బీఎస్ఎన్ఎల్ వారికి నెట్ సౌకర్యం కల్పించాలని కోరినట్టు తెలిపారు. ఇసుక ఎగుమతి చేయడానికి ఎక్స్‌కవేటర్లు కూడా ఇక్కడ సిద్ధంగా ఉంచారు. అయితే ఇసుక ఎగుమతి చేయడానికి తగిన విధివిధానాలు ఉన్నతాధికారుల నుంచి రాకపోవడం, చార్జీల నిమిత్తం ఎంత వసూలు చేయాలన్నది ఖరారు కాకపోవడంతో తొలిరోజు ఇసుక పంపిణీకి వీలుకాలేదు. సాయంత్రానికి ఇసుక చార్జీలు నిర్ణయించడంతో మంగళవారం నుంచి విక్రయాలు ప్రారంభించే అవకాశం ఉంది. ఉన్నతాధికారుల నిబంధనల మేరకు ఇసుక ఎగుమతి చేస్తామని ఇన్‌చార్జి పెరవలి డిప్యూటీ తహశీల్దార్ (రీ సర్వే) సన్నిబాబు తెలిపారు. ఆయన సోమవారం ఈ స్టాక్ పాయింట్ వద్ద పైఆదేశాల ఎదురుచూశారు. ఆయనతోపాటు తీపర్రు, కానూరు ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, వీఆర్ఏలు నారాయణస్వామి, విశ్వనాథం కూడా ఉన్నారు.

సచివాలయ సర్టిఫికెట్ అవసరం

కొవ్వూరు, జూలై 8 : ఇసుక అవసరమైన నిర్మాణదారులు సచివాలయ సెక్రటరీల వద్ద సర్టిఫికెట్ తీసుకోవాలని కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ చెప్పారు. సోమవారం కొవ్వూరు మండలం కుమారదేవం ఇసుక ర్యాంపును సబ్‌కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. స్టాక్ యార్డులో ఇసుక దొంగతనంగా తరలించకుండా భద్రతా చర్యలు చేపట్టామన్నారు. స్టాక్‌యార్డుకు గేట్లు, విద్యుత్ లైట్లు, సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశామన్నారు. నిరంతరం నిఘా పెట్టాలని అధికారులను సూచించారు. ఆయన వెంట తహశీల్దార్ కె.మస్తాన్ ఉన్నారు.



కొవ్వూరు మండలం కుమారదేవం ఇసుక ర్యాంపులో తనిఖీలు నిర్వహిస్తున్న సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ



రాజమహేంద్రవరంలో సోమవారం జరిగిన బీజేపీ రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న కేంద్ర సహాయ మంత్రులు, బీజేపీ రాష్ట్ర మంత్రి, నేతలు

క్షేత్రస్థాయి నుంచి బీజేపీ బలోపేతమే లక్ష్యం

రాజమహేంద్రవరంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదం

- 5లో



పారిశుధ్య పనులపై కలెక్టర్ ఆగ్రహం

ధవళేశ్వరంలో జిల్లా కలెక్టర్‌తో మాట్లాడుతున్న స్థానిక ఎమ్మెల్యే గోరంట్ల

- ధవళేశ్వరంలో డ్రైన్‌లు, పారిశుధ్య పరిస్థితులను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే
- డ్రైనేజీల అభివృద్ధికి రూ.3 కోట్లతో ప్రణాళిక : ఎమ్మెల్యే గోరంట్ల

ధవళేశ్వరం, జూలై8: ధవళేశ్వరం గ్రామంలో నెలకొన్న అపారిశుధ్య పరిస్థితులపై కలెక్టర్ ప్రశాంతి అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వారం రోజుల్లో పరిస్థితులను మెరుగుపరచాలని ఆదేశించారు. సోమవారం గ్రామంలో కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మండల అధికారులతో కలిసి పర్యటించారు. డ్రైన్‌లలో నీరుపారక బురదమయంగా మారిన రోడ్లపై వీరు నడిచి వెళుతూ పరిశీలించారు. 140 మంది పారిశుధ్య సిబ్బంది ఉన్నా పారిశుధ్య పనుల నిర్వహణపై అధికారులు అలసత్వం వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సిబ్బంది హాజరు వివరాలతో కూడిన నివేదిక అందజేయాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. పలుచోట్ల మురికినీటి కాలువలను ఆక్రమించి నిర్మాణాలు ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఆ నిర్మాణాలను ఇంటి యజమానులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేకపోతే పంచాయతీ సిబ్బందిచే ఆ నిర్మాణాలను తొలగించి అందుకు అయ్యే రుసుం వసూలు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ డ్రైనేజీల కోసం రూ.3 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేశామని, ఈ నిధులు విడుదలైతే త్వరితగతిన పనులు చేపట్టాల్సి ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పర్యటనలో డీపీవో డి.రాంబాబు, ఎంపీడీవో శ్రీనివాసరావు, మండల ప్రత్యేకాధికారి కేవీఎస్ జ్యోతి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



డ్రైన్‌లో చెత్తను తొలగిస్తున్న ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి

ఎమ్మెల్యే గోరంట్ల.. స్వచ్ఛభారత్

ధవళేశ్వరం శాటిలైట్ సిటీలో సోమవారం ఉదయం నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పాల్గొని డ్రైన్‌లో చెత్తను తొలగించారు. టీడీపీ ధవళేశ్వరం పట్టణాధ్యక్షుడు పందూరి అప్పారావు ఆధ్వర్యంలో ఇది జరుగగా నాయకులు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ పి ప్రశాంతికి ఫిర్యాదు చేస్తున్న పాత, కొత్త తుంగపాడు రైతులు

జగనన్న కాలనీకి భూములు ఇచ్చాం..

డబ్బులు ఇవ్వలేదు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాత, కొత్త తుంగపాడు రైతుల ఆవేదన

రాజమహేంద్రవరం సిటీ/రూరల్ జూలై8: జగనన్న కాలనీల కోసం తమ భూములను సేకరించిన గత ప్రభుత్వం తమకు డబ్బులు ఇవ్వలేదని, ఒరిజనల్ దస్తావేజులు తీసుకుని వాటినీ తిరిగివ్వకుండా ఇబ్బందులకు గురిచేసిందని రాజానగరం మండలం పాత, కొత్త తుంగపాడు గ్రామాలకు చెందిన బాధిత రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యాలయంలో బాధిత రైతులు కర్రి చిన్నా, కాళ్ళ సూర్యకుమారి, సున్న యేసుబాబు, ప్రగడ గోవిందరాజు, సున్న సూర్యవతి తదితరులు కలెక్టర్ పి.ప్రశాంతిని కలిసి తమ సమస్యను విన్నవించారు. 2023 మే 24న అప్పటి సర్వేనెంబరు 402, 391, 390, 123/1లలో 60 ఎకరాల భూములను జగనన్న కాలనీలకోసం అధికారులు సేకరించారని, వాటి ఒరిజనల్ డాక్యుమెంట్లు అధికారులు తీసుకున్నారని, ఇప్పటివరకు తమకు డబ్బులు ఇవ్వలేదన్నారు. కలెక్టర్ మాధవీలతను కలిసి సమస్య వివరించామని, తమ బిల్లులు రద్దుచేసి ఒరిజనల్ దస్తావేజులు తిరిగిస్తామని చెప్పిన అప్పటి కలెక్టర్ ఏ చర్యలు తీసుకోలేదని వివరించారు. తక్షణమే తమ భూముల దస్తావేజులు ఇచ్చేయాలని కలెక్టర్‌కి విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ కొద్దిరోజుల్లో మీ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మరెన్నో వినతులు... సావధానంగా విన్న కలెక్టర్

అలాగే రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాలకు చెందిన దివ్యాంగులు సోమవారం కలెక్టర్ ప్రశాంతిని కలిసి తాము 80 శాతంపైబడి అంగవైకల్యం కలిగిన వారమని, తాము రూ.15 వేల పింఛనుకు అర్హులమని విజ్ఞప్తిచేశారు. దివ్యాంగులను చూసిన కలెక్టర్ కిందకు వచ్చి మరీ అర్జీలను స్వీకరించారు. ఇందులో సీతంపేటకు చెందిన వరలక్ష్మి అనే మహిళ తాను తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నానని, నడవలేని స్థితిలో ఉన్న తనకు దివ్యాంగుల పింఛను రూ.15 వేలు ఇప్పించాలని విజ్ఞప్తి చేసింది. ఈ సమస్యలపై చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. అనంతరం ధవళేశ్వరంనకు చెందిన యర్రా ఉమామహేశ్వరికి దివ్యాంగుల సంక్షేమశాఖ అధ్వర్యంలో రూ.8,500 విలువ చేసే ట్రై సైకిల్‌ను కలెక్టర్ అందించారు. రాజమహేంద్రవరం 49వ డివిజన్ పరిధిలో సుమారు 25 ఎకరాల్లో గోతులుగా ఉన్న క్వారీని పూడ్చివేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని స్థాయీ సంఘం మాజీ ఛైర్మన్ బర్రే కొండబాబు కలెక్టర్, డీఆర్వోలకు విన్నవించారు. కాగా సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు జిల్లా స్థాయి అధికారులురాకుండా కింది స్థాయి ఉద్యోగులను పంపించడంతో కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తూ మైక్‌లో జిల్లా స్థాయి అధికారులుకాని వారు హాలులో ఉంటే తక్షణమే బయటకు వెళ్లిపోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు అర్జీలను రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్, డీఆర్వో నరసింహులు, టూరిజం జేడీ వి.స్వామినాయుడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు టీ రాధిక, ఆర్డీవో కృష్ణనాయక్ తదితరులు స్వీకరించారు.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సంధ్య



స్టాప్ డయేరియాపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సంధ్య

కొవ్వూరు, జూలై 8: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సంధ్య అన్నారు. కొవ్వూరు అర్బన్‌హెల్త్ సెంటర్ పరిధిలో సోమవారం స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి డయేరియా, వర్షాకాలంలో వ్యాప్తిచెందే వ్యాధులు, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాను తనిఖీ చేశారు. తాగునీటి నాణ్యత పరీక్షలు నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో వర్షపునీరు, మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే దగ్గరలోని ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ టి.సుష్మ, మున్సిపల్ ఏఈలు దుర్గాకిషోర్, సుమంత్, ఏఎన్‌ఎంలు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

కొవ్వూరు, జూలై 8: మండలంలోని వేములూరులో పేరుకుపోయిన చెత్త, రోడ్డుకిరు పక్కలా పేరుకుపోయిన జంగిల్స్‌ను తొలగించే కార్యక్రమాన్ని టీడీపీ నాయకుడు అక్కిన రాంబాబు ఆధ్వర్యంలో చేపట్టారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముండడంతో సోమవారం గ్రామంలో దీప్తి స్కూల్ నుంచి గ్రామ శివారు వరకు జంగిల్స్‌ను ప్రొక్లెయినర్ సాయంతో తొలగించారు. కార్యక్రమంలో ఇమ్మని ప్రసాద్, బొంబోతు సురేష్, నక్కా శ్రీను, జనసేన నాయకుడు మజ్జి శేఖర్, ఈవోపీఆర్డీ శర్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ తిలక్ పాల్గొన్నారు.

ప్రీ స్కూల్ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే

కొవ్వూరు, జూలై 8: మండలంలోని ఐ.పంగిడి సెక్టారు పరిధిలో ధర్మవరం, కాపవరం, పెనకనమెట్ట సావరం, ఐ.పంగిడి గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ విద్యార్థులకు సోమవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అనంతరం గ్రామస్థులకు స్టాప్ డయేరియాపై అవగాహన కల్పించారు. సీడీపీవో డి.మమ్మీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.వెంకటపద్మిణి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వ్యాయామోపాధ్యాయుల జిల్లా సమావేశం

కొవ్వూరు, జూలై 8: జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు, సహాయకుల వార్షిక సమావేశం ఈ నెల 10న కొవ్వూరులోని లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్టు వ్యాయామోపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఈ సమావేశానికి డీఈవో కె.వాసుదేవరావు, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని, జిల్లాలో పనిచేస్తున్న సుమారు 220 మంది వ్యాయామ ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 11 ఫిర్యాదులు

కొవ్వూరు, జూలై 8: కొవ్వూరు డివిజన్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 11 ఫిర్యాదులు స్వీకరించినట్టు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కొవ్వూరు మున్సిపాలిటీకి 4, నల్లజర్ల ఎంపీడీవోకు 1, కొవ్వూరు ఎంపీడీవోకు 1, కొవ్వూరు మెరకవీధిలో విద్యుత్ స్తంభాన్ని మార్పు చేయాలని ఎలక్ట్రికల్ ఏఈకి 1, కొవ్వూరు మండలం చిడిపి లంకభూములలో భారీ వృక్షాలను అనుమతులు లేకుండా నరికివేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు 1, వాడపల్లి వేద పాఠశాల ప్రాంగణంలోని వృక్షాలకు తేనే పట్టు ఉండడం, విషసర్పాలు తిరుగుతుండడంతో వ్యవసాయ భూమిలో పనులు చేసేందుకు కూలీలు రావడం లేదని పంట నష్ట పోతుందని హార్టికల్చర్ అధికారికి 1, ఆర్డీవో కార్యాలయానికి 2 ఫిర్యాదులను స్వీకరించామని సబ్ కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గోపాలపురంలో 24 ఫిర్యాదులు

గోపాలపురం, జూలై 8: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు 24 ఫిర్యాదులందాయి. దొండపూడి రహదారి విస్తరణ కుదించాలంటూ 21, గోపాల పురం జేబీ స్కూల్ ఆక్రమణపై సర్వే చేయాలని 1, మాతంగమ్మ మెట్టపై సర్వే నెంబర్ 1-1లో ఆక్రమణలు తొలగించాలని 1, కొవ్వూరుపాడులో ఇంటి స్థల వివాదాన్ని పరిష్కరించాలని ఒక ఫిర్యాదు అందినట్టు కార్యాలయ అధికారులు తెలిపారు.

నిడదవోలు రోటరీ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



కార్యక్రమంలో మాటాడుతున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, జూలై 8: రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిడదవోలులో నిర్వహించారు. దీనికి రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. గత సార్వత్రిక ఎన్నికల్లో రోటరీ ఒక రాజకీయ పక్షానికి కొమ్ము కాచి చాలా కష్టపడి పనిచేసిందని, అయితే రోటరీ కైలాస భూమికి అనుసంధానంగా బ్రిడ్జిని సాధించుకోలేకపోయారన్నారు. చిన కాశీరేవు బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం క్లబ్ నూతన అధ్యక్షుడిగా కొర్లేపర వెంకట రత్నకుమార్, కార్యదర్శిగా అనంతపల్లి కృష్ణచైతన్య, ట్రెజరర్‌గా కేవీవీ సత్యనారాయణ, పలువురు క్లబ్ డైరెక్టర్స్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, దాకారపు కృష్ణ, నీలం నాగేంద్రప్రసాద్, ఆనందం వెంకటేశ్వరరావు, పోలదాసు శ్రీనివాస్, కొమ్మిన వెంకటేశ్వరరావు, రంగా రమేష్ పాల్గొన్నారు.

గుబ్బాలమ్మ హుండీ ఆదాయం రూ.2 లక్షలు

నిడదవోలు, జూలై 8: మండలంలోని గోపవరంలో గుబ్బాలమ్మ ఆలయ హుండీల లెక్కింపు కార్యక్రమం సోమవారం జరిగింది. మూడు నెలల 25 రోజులకు గాను రూ.2,00,738 ఆదాయం లభించినట్టు ఆలయ మేనేజర్ నామా సూర్యప్రకాశరావు తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎ.సుజన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆరేపల్లి చిన నంగాలు, ఉపసర్పంచ్ అరుగుల శ్రీనివాస్, నీలం శ్రీనివాస్, పి.వెంకన్న, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి చదువుకు తోట ట్రస్ట్ ఆర్థిక సాయం

పెరవలి, జూలై 8: తోట చారిటబుల్ ట్రస్టు ద్వారా మండలంలోని మల్లేశ్వరానికి చెందిన సాయి కార్తీక్‌కు ఇంటర్మీడియట్ ఫీజు నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. తండ్రి మరణించడంతో ఆర్థిక ఇబ్బందులతో చదువుకోవడానికి కార్తీక్ ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న తోట ట్రస్టు సభ్యులు అతడి కళాశాల ఫీజు రెండేళ్లకు ఇవ్వడంతోపాటు బుక్స్, యూనిఫామ్ అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ తోట మాధవరావు, తోట సత్య, ప్రసన్న, కోటేశ్వరరావు, మెహర్ పాల్గొన్నారు.

కూటమి కార్యకర్తల సమావేశం



పెరవలి, జూలై 8: కానూరు అగ్రహారంలో గ్రామస్థాయి కూటమి కార్యకర్తల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో సమస్యలపై చర్చించారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలు తమకు ఏమైనా ఇబ్బందులుంటే గ్రామ కమిటీకి తెలియజేయాలని సూచించారు. గ్రామంలో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. సమావేశంలో హనుమంతు సుబ్రహ్మణ్యం, దాసం బాపన్ననాయుడు, హరిదాసు సుబ్బారావు, సత్తి చిన్నకాపు, గోపాలరావు, బి.గోపన్న, పి.పుత్రయ్య, దాసం చిన్న వెంకన్న పాల్గొన్నారు.

రేపటి నుంచి కాల్ధరిలో రైల్వే బ్రిడ్జికి మరమ్మతులు

ఉండ్రాజవరం, జూలై 8: మండలంలోని కాల్ధరి గ్రామంలో రైల్వే అండర్ బ్రిడ్జి మరమ్మతులు కారణంగా ఈనెల 10వ తేదీ ఉదయం 8గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 6గంటల వరకు మూసి వేస్తున్నట్టు రైల్వే తణుకు సీనియర్ సెక్షన్ ఇంజనీర్ పీవీఎస్ ప్రసాద్ తెలిపారు. మోటారుసైకిళ్లు, ఆటోలు వెళ్లవచ్చని, నాలుగు చక్రాల వాహనాలు రాకపోకలు నిలుపుదల చేసినట్టు చెప్పారు.

సిటీ బస్సులు నడపాలి: ఎస్‌ఎఫ్‌ఐ

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 8: రాజమహేంద్రవరంలో సిటీ బస్సులు నడపాలని ఎస్‌ఎఫ్‌ఐ కోరింది. ఈమేరకు సోమవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్బాంకు వినతిపత్రం అందజేశారు. సిటీ బస్సులతో పాటు స్టూడెంట్ స్పెషల్ సర్వీసులు తిప్పాలని, బస్ సౌకర్యం లేకపోవడంతో పల్లకడియం, ఈలకొలను, దొంతమూరు, బాలవరం గ్రామాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, బలభద్రపురం నుంచి ఈ గ్రామాల మీదుగా రాజమహేంద్రవరంనకు బస్సులు నడపాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు వై.భాస్కర్, వి.రాంబాబు, కనక అచ్చారావు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులందరికీ చేరాలి
- పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్
- ఉండ్రాజవరం మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

ఉండ్రాజవరం, జూలై 8: జలజీవన్ మిషన్ పథకంలో పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఉద్యోగులు పార్టీలకతీతంగా పనిచేయాలని, అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళల్లో అందిస్తూ పరిపాలన కొనసాగించేలా అధికారులు దృష్టి సారించాలన్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్లు మరమ్మతులు చేపట్టాలన్నారు. ఇరిగేషన్ పనులు యుద్ధ ప్రాతిపదిక నిర్వహిస్తామన్నారు. అంతర్గత రోడ్ల నిర్మాణానికి త్వరలో కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో క్షేత్రస్థాయిలో అర్హులైన వారందరికి చేరేలా అధికారులు పనిచేయాలని మంత్రి దుర్గేష్ చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. కె.సావరం ఎంపీటీసీ సభ్యుడు కాకర్ల కరుణాకర్, తాడిపర్రు సర్పంచ్ కరుటూరి నరేంద్ర బాబు, వేలివెన్ను సర్పంచ్ అత్తిలి సత్యనారాయణ, కె.సావరం సర్పంచ్ నార్ని రామకృష్ణ తదిరులు గ్రామాల్లో ఉన్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా ఆయా శాఖల అధికారుల ద్వారా సమధానాలు ఇప్పించారు. ఉపాధి పథకంలో పక్కదారి పట్టిన నిధులు లబ్ధిదారులకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని దుర్గేష్ చెప్పారు.వివిధ శాఖల పురోగతిపై సమీక్షించారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీలు చెట్టే నవీన్, ఎన్.సరోజిని, తహశీల్దార్ కె.నవీన్ కుమార్, ఎంపీడీవో జేడీవీ ప్రసాద్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని వినతి

వైద్యశాఖలో పనిచేస్తున్న మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్స్‌ను జీవో నెం.114 ప్రకారం రెగ్యులర్ చేయాలని కోరుతూ ఉండ్రాజవరం మండలంలో పనిచేస్తున్న సిబ్బంది సోమవారం మంత్రి దుర్గేష్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో ఈ జీవోలో కొంతమంది రెగ్యులర్ అయ్యారని, మిగిలిన 966మందిని రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా జాయింట్ సెక్రటరీ కాపా నాగరాజు, కె.సీతయ్య, ఆర్.శ్రీనివాసరావు, ఎం.సుధాకర్, వి.చిరంజీవి, యు.రాము, బి.శ్రీనివాస్, డి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పాలసీతో సామాన్యులకు ఊరట

- నెరవేరనున్న పేదల సొంతింటి కల: ఎమ్మెల్యే మద్దిపాటి



పాస్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి

నల్లజర్ల, జూలై 8: ఏపీ ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ తీసుకురావడం వల్ల సామాన్యులకు భారీ ఊరట లభించిందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. సోమవారం నల్లజర్ల టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విధానం ద్వారా పేదల సొంతింటి కల నెరవేరనుందని, ఎన్నికల్లో హామీని నెల రోజుల్లోపే అమలు పర్చడంపై అభినందనీయమన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక మాఫియా నడిచిందని, ఇసుక కుంభకోణంలో రూ.50 వేల కోట్లకు పైగా కొల్లగొట్టారన్నారు. వైసీపీ నేతలే ఇసుకాసుర అవతారమెత్తి కోట్లు గడించారన్నారు. ఇదిలా ఉండగా నల్లజర్లలో మల్టీస్పెషలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కోరినట్టు ఎమ్మెల్యే మద్దిపాటి తెలిపారు. సోమవారం రాజమహేంద్రవరంలో మంత్రిని కలిసి నల్లజర్ల ప్రభుత్వాసుపత్రిని అప్‌గ్రేడ్ చేసి 24గంటలూ వైద్య సదుపాయం అందించే విధంగా వైద్యులను, సిబ్బందిని ఏర్పాటు చేయాలని, గోపాలపురం నియోజకవర్గానికి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని మంజూరు చేయాలని మంత్రిని కోరగా మంత్రి సానుకులంగా స్పందించినట్టు చెప్పారు.ఈ సందర్భంగా తన వెంట యద్దనపూడి బ్రహ్మరాజు, లంకా సత్యనారాయణ ఉన్నారన్నారు.

క్రైస్తవులకు అండగా ఉంటా

పాస్టర్లలతోపాటు క్రైస్తవులందరికీ తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే మద్దిపాటి అన్నారు. అచ్చన్నపాలెంలోని కాక్లర అబ్రహం చర్చిలో మండలాధ్యక్షుడు పెనుమాక రాజకుమార్ అధ్యక్షతన జరిగిన పాస్టర్ అసోసియేషన్ మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రతి మండల కేంద్రంలో పాస్టర్లు కమ్యూనిటీ హాల్ నిర్మించుకునే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. అనంతరం ఎమ్మెల్యే మద్దిపాటిని అసోసియేషన్ ఘనంగా సత్కరించింది. సమావేశంలో బేతేల్ మినిస్ట్రీస్ డైరెక్టర్ చెల్లు యోహన్‌రావు, కళ్లెం రాజు, నిమ్మల సురేష్, డి.శ్యాంబాబు, పాస్టర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాల అమలు

దేవరపల్లి, జూలై 8: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను కులమతాలకు అతీతంగా అందజేస్తామని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని యర్నగూడెంలో జరిగిన పెంతుకోస్తు బిలీవర్స్ చర్చ్‌లో సేవకుల ఆత్మీయ సదస్సుకు ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిపాటి మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని పాస్టర్ల సంఘాలకు సహాయసహకారాలు అందిస్తానన్నారు. పెంతుకోస్తు బిలీవర్స్ సేవకులకు కమ్యూనిటీ హాలు కోసం 5సెంట్లు స్థలం, భవన నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గన్నమని హరికృష్ణ, పెనుమత్స సుబ్బరాజు, బొల్లిన భాస్కర్, గద్దే శ్రీనివాస్, బళ్ళా సూర్యచక్రం పాల్గొన్నారు.

'నాడు-నేడు'లో అవకతవకలపై విచారణ జరిపిస్తాం

- తప్పు జరిగినట్టు రుజువైతే చర్యలు తప్పవు
- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



వేములూరు ప్రాథమిక పాఠశాలలో పనులను తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జూలై 8: నాడు-నేడు పనుల్లో అవకతవకలపై విచారణ జరిపాస్తామని, తప్పు జరిగినట్టు రుజువైతే చర్యలు తప్పవని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం కొవ్వూరు మండలం వేములూరులో ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు పథకంలో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణాలను పరిశీలించారు. వాటికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి, అదనపు తరగతి గదులకు నిధుల మంజూరు, జమ, వ్యయం, నిల్వ తదితర అంశాలపై అడిగిన ప్రశ్నలకు ప్రధానోపాధ్యాయుడు సమాధానం చెప్పలేక పోవడంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ తిలక్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను పూర్తి నివేదిక అందజేయాలని ఆదేశించారు. నాడు-నేడు పనుల్లో అవకతవకలు జరిగాయని గ్రామస్థుల నుంచి ఫిర్యాదులు రావడంతో పాఠశాలను పరిశీలించినట్టు ఎమ్మెల్యే చెప్పారు. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో నాడు-నేడు పథకంలో మంజూరైన పనుల్లో ఏ ఒక్కటీ పూర్తి చేయలేదని, ఈ పనులకు అయిన ఖర్చు, ప్రభుత్వం సరఫరా చేసిన మెటీరియల్‌పై అధికారులతో విచారణ చేపడతామని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణారావు, అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, అక్కిన రాంబాబు, పెరవలి రంగాప్రసాద్, మరపట్ల కళాధర్, ఇమ్మని ప్రసాద్, ఎల్ఐసీ సత్యనారాయణ, బొంబోతు సురేష్, అత్తిలి నాగరాజు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా గ్రామంలో టీడీపీ నాయకులు చేపట్టిన జంగిల్ క్లియరెన్సు పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. జనాభాకు అనుగుణంగా ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి ఆక్రమణలు తొలగించి రోడ్డు వెడల్పు చేయడానికి, డ్రైను నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

వైఎస్సార్ జయంతి

- దివంగత ముఖ్యమంత్రికి పలువురి ఘన నివాళి



దేవరపల్లిలో వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి వనిత

కొవ్వూరు, జూలై 8: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని సోమవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. కొవ్వూరు మెరకవీధిలో వైఎస్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి స్వీట్స్ పంచారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు పండ్లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణణ్, బావన రాజేష్ కవల నాగేశ్వరరావు, బండి పట్టాభిరామారావు, నగళ్లపాటి శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. పెనకనమెట్టలో బండి పట్టాభిరామారావు, పంగిడిలో చౌటిపల్లి వీరన్న ఆధ్వర్యంలో వైఎస్ జయంతి జరిపారు.

నల్లజర్ల: మండలంలోని అనంతపల్లిలో ఎంపీపీ బంకా జయలక్ష్మి ఆధ్వర్యంలో మాజీ హోంమంత్రి తానేటి వనిత వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో బంకా అప్పారావు, గగ్గర శ్రీనివాస్, కారుమంచి రమేష్, గొర్రెల సాంబశివనాయుడు, యజ్జవరపు లక్ష్మి, బళ్ళ ప్రభాకరావు పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలు వైఎస్సార్ కాలనీలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు నివాళులర్పించారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, 108, ఫీజు రీయింబర్స్‌మెంట్ సేవలు బలహీన వర్గాల ప్రజలకు ఎంతో దోహదపడ్డాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, కామిశెట్టి సత్తిబాబు, గాజుల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: తాళ్లపూడి మెయిన్ రోడ్డులోని వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ ప్రజల మనస్సులో చెరగని ముద్రవేసుకున్నారన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ, వైసీపీ మండలాధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, గూడా విజయరాజు, బండ్రెడ్డి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అన్నదేవరపేటలో అనారోగ్యంతో బాధపడుతున్న కవులూరి రాజుకు పప్పోప్పుల నాని ఆర్థిక సాయం అందించారు. పెద్దేవంలో సిర్రా గోపి, మలకపల్లిలో కుంటముక్కల కేశవనారాయణ, గజ్జరంలో సర్పంచ్ గండి రాంబాబు, వేగేశ్వరపురంలో శీర్ల బ్రహ్మానందం, పోచవరంలో కాకర్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వైఎస్ఆర్ జయంతిని నిర్వహించారు.

దేవరపల్లి: దేవరపల్లిలో వైఎస్సార్ విగ్రహానికి మాజీ హోం మంత్రి తానేటి వనిత పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రాలో అందరూ ముఖ్యమంత్రుల కంటే రాజశేఖర్‌రెడ్డి ప్రత్యేక పథకాలు రూపొందించి అమలు చేశారన్నారు. నాయకులు, కార్య కర్తలు వైసీపీ బలోపేతాకి కృషి చేయాలన్నారు. అలాగే యాదవోలు, యర్నగూడెం, త్యాజంపూడి, చిన్నాయిగూడెంలో వైఎస్ విగ్రహాలకు నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కేవీకే దుర్గారావు, గన్నమని జనార్ధనరావు, నరహరిశెట్టి రాజేంద్రబాబు, కూచిపూడి సతీష్, గడా రాంబాబు, సర్పంచ్ కడిమి వీరకుమారి, దుగ్గిన గంగధర్, కవల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించాలి

తహశీల్దార్ వనజాక్షి

గోపాలపురం, జూలై 8: క్షేత్ర స్థాయిలో సాగుచేసే ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డు అందజేయాలని తహశీల్దార్ డి.వనజాక్షి అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్వో, వ్యవసాయ, ఉద్యానవన సిబ్బందితో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది 6210 కార్డులను కౌలు రైతులకు అందించాలన్నారు. గ్రామాల వారీగా వాస్తవ కౌలు రైతులను గుర్తించి ఆ భూ యజమాని అంగీకార పత్రాన్ని తీసుకుని కౌలు గుర్తింపు కార్డులను మంజూరు చేయాలన్నారు. గుర్తింపు పొందిన ప్రతి కౌలు రైతుకు ప్రభుత్వం అందించే రాయితీలతో పాటు పంట పెట్టుబడి, నష్ట పరిహారం, పంటల బీమా, ఈ పంట నమోదు వంటి ప్రయోజనాలు రైతుకు చేకూరతాయని చెప్పారు. కార్యక్రమంలో ఏవో బి.రాజారావు, డీటీలు ప్రదీప్, కృష్ణ, వీఏవోలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.



జనసేన సమావేశానికి విచ్చేసిన ఇన్‌చార్జి రామారావు

జనసేన బలోపేతానికి కృషి

నియోజకవర్గ ఇన్‌చార్జి రామారావు

తాళ్లపూడి, జూలై 8: జనసేన పార్టీ మండల సమావేశం వేగేశ్వరపురంలో తుమ్మాలమ్మ ఆలయం వద్ద సోమవారం జరిగింది. పార్టీ గ్రామాధ్యక్షుడు తైలం పోశారావు, తైలం నాగేశ్వరావు, బి.గాంధీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. పార్టీని నియోజకవర్గంలో మరింత బలోపేతం చేయాలని, దీనిలో భాగంగా మండల, గ్రామ కమిటీల్లో మార్పులు ఉంటాయన్నారు. ఆర్థిక నేరాల్లో ఉన్న వారు ఏ పదవిలో ఉన్నా సరే ఉపేక్షించబోమన్నారు. సమావేశంలో మండల మహిళా అధ్యక్షురాలు సంకాబత్తుల వెంకటలక్ష్మి, యువజన అధ్యక్షుడు పూలపల్లి బాలకృష్ణ, తూము భవాని, పెన్నాడ నాయుడు, అన్నవరం పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

బీజేపీ బలోపేతమే లక్ష్యం

పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 8 : బీజేపీ రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం సోమవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జరిగింది. రాష్ట్రంలో క్షేత్రస్థాయి నుంచి బీజేపీ పార్టీని బలోపేతం చేసే విషయంపై కార్యవర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ, తెలుగుదేశం, జనసేన కూటమి ఘన విజయం సాధించిన తర్వాత రాష్ట్రస్థాయిలో నిర్వహించిన తొలి సమావేశం కావడంతో దీనికి ప్రాధాన్యత ఏర్పడింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు ఎల్ మురుగన్, భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్‌యాదవ్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ తదితరులు మాట్లాడారు. కేంద్ర సమాచారశాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ మాట్లాడుతూ డబుల్ ఇంజన్ సర్కార్ ద్వారా దేశంలో అభివృద్ధి వేగంగా జరుగుతోందని, గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లో మాదిరిగానే ఆంధ్రరాష్ట్రంలోనూ రాబోయే రోజుల్లో అభివృద్ధి వేగం పుంజుకుంటుందన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో జగన్ రాక్షస, నియంతృత్వ, అవినీతి, అరాచకపాలన వల్ల వ్యవస్థలన్నీ నిర్వీర్య మయ్యాయన్నారు. ప్రతీ శాఖను తాకట్టుపెట్టి పెద్దమొత్తంలో అప్పులు చేశారని ఈ ఆర్థిక విధ్వంసం పూడ్చాలంటే దశాబ్దాలు పట్టేటట్టు ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి విజయంతో వచ్చిన బాధ్యతను బీజేపీ కేడర్ అంతా గుర్తుంచుకోవాలని... ప్రజాసంక్షేమ పాలన, రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడే పాలన, అవినీతిరహిత పాలన అందిస్తేనే ప్రజలు మనల్ని ఆశీర్వదిస్తారని గమనించాలని పేర్కొన్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ఏపీలో గెలుపొందిన బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలను పేరు పేరునా అభినందించారు. ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, విష్ణుకుమార్‌రాజు, ఆదినారాయణరెడ్డి, సుజనాచౌదరి, పీవీ పార్థసారథి, ఎన్.ఈశ్వరరావు, కామినేని శ్రీనివాసరావు, నాయకులు మధుకర్, జీవీఎల్ నరసింహరావు, సోము వీర్రాజు, పీవీఎన్ మాధవ్, శివప్రకాష్, విష్ణువర్ధన్‌రెడ్డి, కాశీ విశ్వనాథరాజు, లంక దినకర్, పాతూరి నాగభూషణం, వేటుకూరి సూర్యనారాయణరాజు, రేలంగి శ్రీదేవి, బొమ్ముల దత్తు, రొంగల గోపి, అడబాల రామకృష్ణారావు, ఎనుముల రంగబాబు, కురగంటి సతీష్ తదితరులతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చక్కటి సమన్వయంతో కూటమి విజయం

కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

బీజేపీ, తెలుగుదేశం, జనసేన పార్టీల చక్కటి సమన్వయంతో రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించిందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలో జరిగిన బీజేపీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అరుణ్‌సింగ్, సిద్ధార్థనాథ్ సింగ్ వంటి పెద్దలు ఈ విషయంలో చేసిన కృషి అభినందనీయమన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇలాంటి సమన్వయం పరిస్థితి ఉందని ఆయన పేర్కొన్నారు. ఐపీసీ, సీఆర్‌పీసీ, ఐఏఎస్ చట్టాలను, వాటిని భారత న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం పేరుతో సత్వరమే అమలయ్యే చట్టాలను అమల్లోకి తీసుకొచ్చిన ప్రధాని మోదీ ప్రభుత్వానికి మద్దతుగా ప్రజల తరపున బీజేపీ ఆంధ్రప్రదేశ్ కార్యవర్గ స్వాగతిస్తూ ధన్యవాద తీర్మానం ప్రవేశపెట్టినట్టు ఆయన పేర్కొన్నారు.

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా వెంకటరెడ్డి



అనపర్తి, జూలై 8: రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని రామవరం గ్రామానికి చెందిన కర్రి వెంకటరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన జిల్లా అసోసియేషన్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటరెడ్డి, కార్యదర్శిగా మల్లిడి రామ్మూర్తిరెడ్డి, ట్రెజరర్‌గా బలుసు శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా సూరపురెడ్డి వీర్రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ నూతన కార్యవర్గం ఏర్పాటైన సందర్భంగా ఈ నెల 10న అనపర్తిలోని ఎస్ఎన్ఆర్ కళ్యాణ మండపంలో ఉదయం 11గంటలకు సమావేశం ఏర్పాటు చేస్తున్నామని, రైస్‌మిల్లర్లు తప్పక హాజరు కావాలని కోరారు.

తల్లీకూతుళ్ల అదృశ్యం

కొవ్వూరు, జూలై 8: తల్లీకూతుళ్ల అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.సుధాకర్ తెలిపారు. కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామానికి చెందిన మద్రి వెంకన్నబాబు గత నెల 12న ఉదయం 11గంటలకు పనికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చేసరికి భార్య మద్రి భవాని, మద్రి రోహితలక్ష్మి కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినీ ఆచూకీ లభించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.